Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను
ప్రజాతీర్పు The people's Verdict తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly
సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..
కేంద్ర, రాష్ట ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను
వెంటనే కావలెను • బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు ఆర్‌సి ఇన్‌చార్జిలు • మండల రిపోర్టర్లు
అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 235 | హైదరాబాద్ | గురువారం 09 జూలై 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారత సాంస్కృతిక వారసత్వం

### ప్రధాని మోదీ స్పష్టీకరణ

- ఇండోనేసియాలో ప్రంబనన్ ఆలయ సందర్శన
- ఇది భారత్, ఇండోనేసియాల నాగరికతా బంధాలకు నిదర్శనమని వెల్లడి
- ఆలయ పరిరక్షణ ప్రాజెక్టు ప్రారంభం

ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతదేశ సాంస్కృతిక వారసత్వం కనిపిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. ఇండోనేసియాలోని యోగ్యకార్తాలో శతాబ్దాల చరిత్ర కలిగిన ప్రఖ్యాత ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని ఆయన బుధవారం దర్శించుకున్నారు.

-2లో

# ఎవరి దారి వారిదే!

## మాట వినని మంత్రులు.. సీఎంతో పెరిగిన గ్యాప్

- రేవంత్‌కు కొత్త తలనొప్పులు
- తాజాగా కొండా సురేఖ ఉదంతం
- మొన్న జూపల్లి సవాళ్ల పర్వం

కాంగ్రెస్ పార్టీని, ముఖ్యంగా ప్రభుత్వాన్ని పాత జాఢ్యం ఇంకా వెంటాడుతూనే ఉంది. తెలంగాణలో అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా, కొందరు మంత్రులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిబద్ధతతో తన పని తాను చేసుకుపోతుంటే.. మంత్రులు మాత్రం అసలు ఎవరు ఏం చేస్తున్నారో.. వారికి కేటాయించిన శాఖల్లో ఏం జరుగుతుందో కూడా తెలియడం లేదన్న చర్చ జరుగుతోంది.

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

ఏ ఒక్క మంత్రి కూడా తమ పరిధిలోని శాఖలను పకడ్బందీగా పర్యవేక్షించడం లేదని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలోచనలకు, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పని చేయడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కేబినెట్‌లోని ఎక్కువ మంది సీనియర్ నేతలు తమకు తోచింది తాము చేసుకుంటూ పోతుండటంతో అనేక సమస్యలు వస్తున్నాయి. సమన్వయ లోపానికి ప్రధాన కారణం కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత కలహాలే అన్న విమర్శ వినిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలా మంది మంత్రులు తాము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటే రాజకీయంగా చాలా సీనియర్లమని, తమకు ప్రత్యేకంగా ఎవరి మార్గదర్శకాలు అవసరం లేదనే





భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి కూడా పదే పదే చెప్పినా వినడం లేదని తెలుస్తోంది. సీఎంకు మంత్రులకు మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ పెరగడంతో ఆయన ఒంటరి వాడయ్యారన్న చర్చ జోరుగా జరుగుతోంది.

### సమన్వయం కరువు..

తెలంగాణ మంత్రుల్లో కనీసం ఏ ఇద్దరు మంత్రుల మధ్య కూడా సరైన సమన్వయం లేదు. ఒకరి శాఖా పరిధిలోని అంశాల్లో మరొకరు జోక్యం చేసుకోవడం లేదా స్థానిక గ్రూపు రాజకీయాల కారణంగా ఒకరినొకరు టార్గెట్ చేసుకోవడం ఎక్కువైంది. తాజాగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కనీస సమాచారం ఇవ్వకుండా, ఆమెను పూర్తిగా విస్మరించి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఉన్నతాధికారులతో దేవాదాయ శాఖపై అధికారిక సమీక్ష నిర్వహించడం.. దానిపై సురేఖ నేరుగా సీఎంకు ఘాటుగా ఫిర్యాదు లేఖ రాయడం ఈ అంతర్గత పోరుకు అద్దం పడుతోంది. మరోవైపు ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ప్రతిపక్ష బీఆర్ఎస్‌తో సవాళ్లు చేసి పార్టీని ఇరకాటంలో పెట్టడం, దానిపై సీఎం

- మిగతా 2వ పేజీలో



## ఇక చర్చలు టైమ్ వేస్ట్!

-2లో

### ఇరాన్‌తో ఒప్పందం ముగిసింది

- కాల్పుల విరమణ ముగిసిపోయినట్లే..
- పద్ధతి మార్చుకోకపోతే దాడులు తప్పవు
- మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తాం
- ఖర్గ్ ఐలాండ్‌ను స్వాధీనం చేసుకుంటాం: ట్రంప్

పశ్చిమాసియాలో సంఘర్షణను ముగించడానికి ఇరాన్‌తో కుదుర్చుకున్న మధ్యంతర శాంతి ఒప్పందం.. తద్వారా కాల్పులు విరమణ ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు. బుధవారం తుర్కియేలోని అంకారాలో నాటో శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇరాన్ నాయకులను 'నీచులు, రోగులు'గా అభివర్ణించారు.



## 'బద్రీనాథ్' నిధుల దుర్వినియోగంపై ఉన్నతస్థాయి విచారణ

### ముగ్గురు సభ్యులతో కమిటీ

అక్రమాలపై ఇప్పటికే బీకేటీసీ అంతర్గత విచారణ.. ఒకరి సస్పెన్షన్

ప్రముఖ పుణ్యక్షేత్రమైన బద్రీనాథ్ ఆలయ విరాళా ల్లో చోటు చేసుకున్న అవకతవకలపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. సీఎం పుష్కం సింగ్ ధామి ఆదేశాల మేర కు ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని రంగంలోకి దించింది.

-2లో

## ఆగని భూదందా

### ఫేక్ అకౌంట్లతో ధరణి, భూభారతిలో భారీగా అక్రమాలు

సమగ్ర దర్యాప్తు చేయాల్సిందే ● సింగరేణి విషయంలో కాంగ్రెస్ క్రెడిట్ పాలిటిక్స్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



'రాష్ట్రంలో భూపరిపాలన అస్తవ్యస్తంగా మారింది. అప్పుడు ధరణి, ఇప్పుడు భూభారతి పోర్టల్‌లో ఫేక్ అకౌంట్‌లు వెలుగులోకి వచ్చాయి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ధరణి పోర్టల్‌లో భారీగా ఫేక్ అకౌంట్‌లు సృష్టించారని, వాటిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిందేనని డిమాండ్ చేశారు.

-2లో

## కెనడాతెలంగాణ సంబంధాల బలోపేతం

### సీఎం రేవంత్‌తో కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్ భేటీ

- మెట్రో రైలు విస్తరణ, మూసీ పునరుజ్జీవంపై చర్చ
- కెనడాకు రావాలని రేవంత్‌కు ఆహ్వానం

-2లో

రాష్ట్రంలో సౌర విద్యుదుత్పాదక, హరిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కెనడా సహకా రం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. భారత్‌లో కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్ బుధవారం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కెనడాతెలంగాణ మధ్య వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణల విషయంలో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే అంశంపై ఇరువురు విస్తృతంగా చర్చించారు.





## పుంజుకున్న నైరుతి..

-2లో

### 12 శాతానికి లోటు!

జూలై మొదటి వారంలో దేశవ్యాప్తంగా అంచనాలకు మించి భారీ వర్షాలు నమోదు కావడంతో ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. తాజా వర్షాలతో లోటు కాస్తా 12 శాతానికి తగ్గిపోయిందని కేంద్రం ప్రకటించింది.



## తెలంగాణలో ధాన్యం సేకరణ కోటా పెంచండి

### కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషికి కిషన్‌రెడ్డి వినతి

కొనుగోళ్లు, మిల్లింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజం

తెలంగాణలో 2025-26 యాసంగి (రబీ) సీజన్‌కు నిర్దేశించిన 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని మరింత పెంచాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి కేంద్ర ఆహారం, ప్రజాపంపిణీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషికి విజ్ఞప్తిచేశారు.

-2లో

# నీళ్లు తెచ్చి చూపిస్తా!

### మూణ్నెళ్లు ఇరిగేషన్ శాఖ ఇవ్వు.. చెప్పింది చేయకపోతే రాజకీయ సన్యాసం చేస్తా..

- 152 మీటర్ల బరాజ్‌కు అనుమతి తెచ్చినట్టు నిరూపించినా రాజీనామా చేస్తా
- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు సవాల్
- గోదావరిలో వరద ఉన్నా మోటార్లు ఎందుకు ఆన్ చేయరు?
- తుమ్మిడిహట్టి దగ్గర నీళ్లు లేవని చెప్పిందే సీడబ్ల్యూసీ
- అనుమతి ఆపింది కాంగ్రెస్ సర్కారే..



'నీకు కేసీఆర్ అవసరం లేదు.. నేను చాలు. నాకు మూడు నెలలు ఇరిగేషన్ శాఖ అప్ప గించు.. నీళ్లు ఎలా తేవాలో చూపిస్తా. నీళ్లు తేకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటా.. ఇందుకు నువ్వు సిద్ధమేనా?' అని సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. తుమ్మిడిహట్టి దగ్గర 152 మీటర్లకు మహారాష్ట్ర అనుమతి ఇచ్చినట్లు ఒక్క ఆధారం, ఒక్క లెటర్ బయటపెట్టినా.. ఇప్పుడే నా ఎమ్మె ల్యే పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు.

-2లో

# ఇక చర్చలు టైమ్ వేస్ట్!

**అంకారా, జూలై 08**

ఇరాన్‌తో సంబంధాలు పెట్టుకోవడానికి తాను ఇష్టపడటం లేదని స్పష్టం చేశారు. ఇరాన్‌తో మూడు వారాల క్రితం సంతకాలు చేసిన అవగాహనా ఒప్పందం(ఎంఓయూ) ముగిసిందని పేర్కొన్నారు. ఇకపై వాళ్లతో(ఇరాన్) ఒప్పందాలు చేసుకోవాలని ఎంతమాత్రం అనుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యల వెనుక ఆంతర్యం ఏమిటన్నది కచ్చితంగా తెలియరాలేదు. కానీ, ఇరాన్‌కు వ్యతిరేకంగా ఆయన చేసిన ప్రకటన వెంటనే ప్రభావం చూపింది. చమురు ధరలు 5 శాతానికిపైగా పెరిగాయి. యుద్ధాన్ని ముగించడానికి మధ్యంతర ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత అమెరికా, ఇరాన్‌లు తమ కాల్పుల విరమణను కొనసాగించడానికి ఇబ్బంది పడుతున్నాయి. హార్మూజ్ జలసంధిపై పూర్తిస్థాయిలో పట్టు బిగించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అమెరికా అందుకు అంగీకరించడం లేదు. ఇరాన్ నేతలపై ట్రంప్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "వారు ముమ్మాటికీ నీచులు, రోగగ్రస్తులు, దుర్మార్గులు, హింసాత్మక మనస్తత్వం కలిగిన వ్యక్తులు. వారి వద్ద అణ్వాయుధం ఉంటే ప్రయోగిస్తారు"అని ఆక్షేపించారు. అయితే, అమెరికా, ఇరాన్ ప్రతినిధులు చర్చలను కొనసాగించవచ్చని ట్రంప్ సూచించారు. కానీ, ఆ చర్చల్లో ఒరిగేదేమీ ఉండదని, టైమ్ వేస్ట్ అంటూ కొట్టిపారేశారు. పిచ్చివాళ్లతో చర్చలు జరపడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. అబద్ధాలకోరులతో చర్చించడం అంటే సమయం వృథా చేసుకోవడం తప్ప ఇంకేమీ కాదన్నారు. ఇరాన్‌పై మళ్లీ దాడులకు అమెరికా సన్నద్ధమవుతోందని



ట్రంప్ తెలిపారు. నిన్న రాత్రి వారిపై తీవ్రమైన దాడి చేశామని, బహుశా ఈ రాత్రి కూడా గట్టిగా దాడి చేస్తామని స్పష్టంచేశారు. హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై జరిగిన దాడులకు ప్రతీకారంగానే తమ దాడులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇరాన్ చాలా దారుణంగా వ్యవహరించిందని మండిపడ్డారు. హార్మూజ్‌లో నౌకలపై డ్రోన్లు, క్షిపణిని ప్రయోగించిందని ఆరోపించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే తీవ్రస్థాయిలోదాడులకు దిగుతామని ఇరాన్ మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ఘాటుగా హెచ్చరించారు. ఇరాన్ చమురు మౌలిక సదుపాయాలు ఉన్న ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని అన్నారు. అవసరమైతే ఇరాన్‌కు చెందిన విద్యుత్ కేంద్రాలను, నీటి శుద్ధి ప్లాంట్లను ధ్వంసం చేస్తామని ట్రంప్ చెప్పారు. మంగళవారం ఖర్గ్ ద్వీపంపై దాడులు ఉన్నప్పటికీ అక్కడి చమురు కేంద్రాలపై మాత్రం జరగలేదని ఆయన పేర్కొన్నారు. "బహుశా మేము ఖర్గ్ ఐలాండ్‌ను స్వాధీనం చేసుకోవచ్చు. దాన్ని మేము స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. దాని గురించి ఇరాన్ చేయగలిగేది ఏమీ ఉండదు"అని ట్రంప్ తేల్చిచెప్పారు. మరోవైపు దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్ చమురు అమ్మకాలపై అమెరికా మళ్లీ ఆంక్షలు విధించింది. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఘర్షణ ఒక్కసారిగా తీవ్రరూపం దాల్చడం ప్రపంచాన్ని మరోసారి ఆందోళనకు గురిచేస్తోంది.



## కెనడాతెలంగాణ సంబంధాల బలోపేతం

**హైదరాబాద్, జూలై 08 (ప్రజాతీర్పు)**

రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని రేవంత్ చెప్పారు. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌ల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. కెనడాలోని విశ్వవిద్యాలయాలూ హైదరాబా ద్‌లో మల్టీ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు పరిశీలించాలని కోరారు. పెట్టుబడులు, వ్యాపార భాగస్వాములకు తెలంగాణ మంచి వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. సీఎం నేతృత్వంలో రాష్ట్ర ప్రతినిధి బృందం కెనడాకు రావాలని కూటర్ ఆహ్వానించారు. డిసెంబర్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో సదస్సుకు కెనడా కంపెనీలు, పెట్టుబడిదారులు, విద్యాసంస్థలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

**అన్నివిధాలుగా సహకరిస్తాం: కూటర్**

మూసీ పునరుజ్జీవం, హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల్లో కెనడా భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలపై రేవంత్, కూటర్ చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు కెనడా అన్నివిధాలుగా సహకరిస్తుందని కూటర్ హామీ ఇచ్చారు. తెలంగాణకెనడా మధ్య పారిశ్రామిక, ఆర్థిక సంబంధాలు బలపడుతున్నాయని, ఫిరాన్ టెక్నాలజీ గ్రూప్ హైదరాబాద్‌లో తయారీ యూనిట్ ఏర్పాటుకు నిర్ణయించడం, సీఐబీసీ హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ప్రారంభించడం వంటి పరిణామాలు రాష్ట్రంపై కెనడా కంపెనీల నమ్మకానికి నిదర్శనమని కూటర్ అన్నారు. సీపీపీ ఇన్వెస్ట్‌మెంట్స్ సంస్థ హైదరాబాద్‌కు చెందిన కంట్రోల్‌ఎస్ (సీటీఆర్‌ఎల్‌ఎస్) డేటా సెంటర్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుని ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందని చెప్పారు.

## ఆగని భూదందా

**హైదరాబాద్, జూలై 08 (ప్రజాతీర్పు)**

కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లలోనే సుమారు 2 వేల ఫేక్ అకౌంట్లు వెలుగుచూడటం ఆందోళన కలిగిస్తుంద న్నారు. ధరణిపై విచారణ జరుపుతు న్న 'సిట్' పరిధిని విస్తరించి, భూభార తి అవకతవకలపైనా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్‌రావు మాట్లాడారు. ధరణి, భూభారతి పోర్ట ల్లలో అక్రమాలు బయటపడతాయనే భయంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి నాట కాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. సమగ్ర విచారణ చేసి అవినీతిలో భాగస్వాములైన రాజకీయ నాయకులు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాళేశ్వరాన్ని డ్రామేశ్వరంగా మారుస్తున్నారని, ప్రజల దృ ష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కన్నెపల్లి, మేడిగడ్డ బరాజ్ అంశాలను తరచూ తెరపైకి తెస్తుందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీతో విచారణ జరిపించాలని మొట్టమొదట డిమాండ్ చేసింది బీజేపీయేనన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టాలని హితవు పలికారు. రూ.లక్షల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టి, రైతులకు ఉపయోగపడేలా చూడాలని డిమాండ్ చేశారు.

**తాడిచర్ల రూ.64 వేల కోట్ల ఆదాయం..**

బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని నిర్లక్ష్యం చేసి నష్టాల్లోకి నెట్టాయని, మోదీ సర్కార్ సంస్థకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టిందని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ పరిధిలో ప్రస్తుతం 39 వర్కింగ్ మైన్స్ ఉండగా.. 31 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు, 41 వేల మంది శాశ్వత ఉద్యోగులు ఆధారపడి జీవిస్తున్నారని గుర్తుచేశారు. ఈ తరుణంలో సింగరేణికి కేంద్ర ప్రభుత్వం తాడిచర్ల- బ్లాక్‌ను కేటాయించడం పట్ల తెలంగాణ ప్రజల తరఫున ప్రధాని మోదీకి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతు తెలిపారు. సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్న ఈ బ్లాక్ ద్వారా.. సింగరేణి సంస్థకు రూ.64,000 కోట్లకు పైగా ఆదాయం సమకూరనుందని చెప్పారు. దాదాపు 1,200 మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు.

## ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారత సాంస్కృతిక వారసత్వం

**యోగ్యకార్తా, జూలై 08**

ఈ సందర్భంగా మోదీ వెంట ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియంతో కూడా ఉన్నారు. యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడమైన ఈ ఆలయాన్ని ఉమ్మడిగా పరిరక్షించే ప్రాజెక్టును ఇరువురు నేతలు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని భారత్, ఇండోనేసియాల మధ్య చిరకాల నాగరికతా బంధాలకు ఒక అద్భుతమైన నిదర్శనంగా మోదీ అభివర్ణించారు. శతాబ్దాలుగా ఇరుదేశాల ప్రజలను అనుసంధానిస్తున్న ఉమ్మడి వారసత్వానికి ఇదొక గొప్ప ప్రతీక అని పేర్కొన్నారు. భారత్ సహాయంతో ఆలయ సముదాయ పరిరక్షణ, పునరుద్ధరణ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ఇరు దేశాలు మంగళవారం ఒక అంగీకారానికి వచ్చిన సంగతి తెలిసిందే. భారత్ తరఫున ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) కీలకంగా వ్యవహరించే ఈ ఉమ్మడి సంరక్షణ ప్రాజెక్టు.. అలాగే ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని మోదీ, సుబియంతో కలిసి సందర్శించడం వంటి పరిణామాలు భారత్‌ఇండోనేసియా బంధానికి తిరుగులేని ఉదాహరణ అని నిపుణులు పేర్కొంటున్నారు. ఆలయ ప్రదేశంలో ఏఎస్ఐ పరిరక్షణ, పునరుద్ధరణ ప్రాజెక్ట్ ప్రారంభానికి గుర్తుగా ఒక ఫలకాన్ని వారిద్దరూ ఆవిష్కరించారు. తొలుత ప్రంబనన్ ఆలయానికి చేరుకున్న మోదీకి సంప్రదాయ స్వాగతం లభించింది. ఆలయ ప్రాంగణంలో కలియతిరుగుతూ ఇక్కడి విశేషాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ చరిత్రను వివరించారు. మోదీ, సుబియంతో పరస్పరం కరచాలనం చేసుకుని ఫొటోలకు పోజులిచ్చారు. ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగించారు. ఆలయ సముదాయానికి సంబంధించిన ఉమ్మడి పరిరక్షణ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో భాగం కావడం తనకు దక్కిన గౌరవమని మోదీ పేర్కొన్నారు. మిత్రుడు, అధ్యక్షుడు సుబియంతోతో కలిసి ఈ ప్రదేశాన్ని సందర్శించడం వల్ల ఈ సందర్భం తనకు మరింత ప్రత్యేకంగా మారిందన్నారు.

# నీళ్లు తెచ్చి చూపిస్తా!

**హైదరాబాద్, జూలై 08 (ప్రజాతీర్పు)**

లేదంటే రేవంత్‌రెడ్డి అబద్ధం చెప్పి నందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలు, అబ ద్ధపు ప్రచారాన్ని హరీశ్‌రావు తీవ్రంగా ఖం డించారు. బుధవారం తెలంగాణ భవన్ లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాస్తవాలను, ఆధారాలను కాంగ్రెస్ ప్రభు త్వ వైఫల్యాలను, రేవంత్‌రెడ్డి అసమర్థతను ఎండగట్టారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభా వంతో ప్రపంచమంతా చుక్క చుక్క నీటిని ఒడిసిపడుతుందని, రాష్ట్రంలోనూ కరువు పరిస్థితులు ఉన్నా గోదావరి జలాలను వృథాగా జారవిడుస్తున్నారని మండిప డ్డారు. గోదావరిలో సమ్మక్క బరాజ్ దగ్గర ఈ నిమిషం లక్ష క్యూసెక్కుల వరద ఉంటే, దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా కేవలం 2,542 క్యూసె క్కుల నీటిని మాత్రమే లిఫ్ట్ చేస్తున్నారు?, అవకాశం ఉన్నా పూర్తిస్థాయిలో ఎందుకు లిఫ్ట్ చేయడం లేదు? అని ప్రశ్నించారు. సమ్మక్క బ్యారేజీ వద్ద 76 మీటర్ల ఎత్తులో నీళ్లు ఉన్నాయని, 71 మీటర్ల వద్దే దేవాదుల మోటార్లు నడపవచ్చు.. అయినా మోటార్లు ఆన్ చేయకపోవడం ముమ్మాటికీ ప్రభుత్వ క్రిమినల్ నెగ్లిజెన్సే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బరాజ్ ఏమీ కూలిపోలేదు కదా అని నిలదీశారు. కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి రెడీగా ఉన్నాయని, మోటార్లు ఆన్ చేయడానికి ప్రభుత్వానికి వచ్చిన సమస్య ఏంటి? అని ప్రశ్నించారు. ఎవరి కి గురుదక్షిణ చెల్లించుకోవడానికి రైతుల పొలాలను ఎండబెడుతున్నారు? మండిపడ్డారు. గోదావరిలో ఇంత వరద ఉన్నా, ఉమ్మడి



వరంగల్ జిల్లాలో 75 నుంచి 80 శాతం చెరువులు ఎండిపోయి సాగు భూములు ఎడారిలా మారుతున్నాయని.. ఇద్దరు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎందుకు నోరు మెదపరు? అని నిలదీశారు. సమ్మక్క బరాజ్‌పై చర్చకు అసెంబ్లీ పెడతారా? నేను సిద్ధంగా ఉన్నానని సవాల్ చేశారు. అబద్ధాలకు నోబెల్ బహుమతి ఉంటే అది రేవంత్‌రెడ్డికే వస్తుందని, ఆయన పేరును అనుముల రేవంత్‌రెడ్డికి బదులు అబద్ధాల రేవంత్‌రెడ్డి అని మార్చుకుంటే సరిపోతుందని ఎద్దేవా చేశారు. తుమ్మిడిహట్టికి కాంగ్రెస్ హయాంలోనే అనుమతులు వచ్చాయని రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఢిల్లీ, మహారాష్ట్ర, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభు త్వాలే ఉన్నా సీడబ్ల్యూసీ అనుమతి ఎందుకు రాలేదు? ఎనిమిదేళ్లలో అక్క డ తట్టెడు మట్టి ఎందుకు తీయలేదు? అని ప్రశ్నించారు. తుమ్మిడిహట్టికి రూ. 6,000 కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని, పనులు జరగకుండానే సర్వేలు, మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరుతో రూ. 2,328 కోట్లు పందికొక్కుల్లా మెక్కారని ఆరోపించారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక, నీటి పారుదల మంత్రిగా నేను మహారాష్ట్రకు వెళ్లానని.. ఎనిమిదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పుడే అనుమతి ఇవ్వలేదు, ఇప్పుడు మీకెలా ఇస్తాం అని.. అక్కడి మంత్రి నా ముఖం మీదే చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశా రు. బీజేపీ వచ్చాక కూడా కేసీఆర్, విద్యాసాగర్‌రావు, మేము ఎన్నోసార్లు వెళ్లి బతిమిలాడామని, అయినా 152 మీటర్లకు ససేమిరా అన్నారని తెలి పారు. మీరు అధికారంలోకి వచ్చి మూడేళు కావస్తోంది, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్రకు ఎన్నిసార్లు వెళ్లి మాట్లాడారు? అని ప్రశ్నించారు. మీకు తెలంగాణ పట్ల ప్రేమ లేదు, చేతలు శూన్యమని విమర్శించారు. తుమ్మిడిహట్టి వద్ద 160 టీఎంసీల నీళ్లు లేవని, కేవలం 102 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందని సీడబ్ల్యూసీ స్వయంగా లేఖ రాసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అంటేనే కరెప్షన్.. కాంగ్రెస్ డీఎన్ఏలోనే కరెప్షన్ ఉందని, మీరు అవినీతి గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించడమేనని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ నీటి లభ్యతను అధ్యయనం చేసి మేడిగడ్డను సూచించిందని, రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ కూడా మేడిగడ్డ దగ్గర నీటి లభ్యత ఉందని, బరాజ్ కట్టొచ్చని చెప్పిందన్నారు. అయితే మిడ్ మానేరుకు నేరుగా నీళ్లు తీసుకుపోలేం, మధ్యలో కోల్ మైన్స్ ఉన్నాయని సూచించింది తప్ప.. ప్రాజెక్టే నిర్మించొద్దని చెప్పలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ సెంట్రల్ గవర్నమెంట్ అప్రూవ్డ్ ప్రాజెక్ట్ అని, మొత్తం 18 కేంద్ర సంస్థల నుంచి దీనికి అనుమతులు వచ్చాయని స్పష్టం చేశారు.

# ఎవరి దారి వారిదే!

- (మొదటి పేజీ తరువాయి )

అసహనం వ్యక్తం చేయడంతో జూపల్లి అలక వహించి సమీక్షలకు సైతం డుమ్మా కొడుతున్నారు.

**రచ్చ చేస్తున్న విపక్షాలు..**

రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రుల తీరు విపక్షాల విమర్శలకు ఊతం ఇస్తోంది. మొన్నటికి మొన్న జూపల్లి కృష్ణారావు తెలంగాణ భవన్‌కు వస్తానని సవాల్ చేయడం.. ఆ తర్వాత పర్యావసానాల్లో బీఆర్ఎస్‌దే పై చేయి అన్నట్లుగా పరిస్థితి మారింది. మంత్రి కొండా సురేఖ రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో కడియం శ్రీహరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ లోకి వచ్చిన నేత. ఆయనపై ఇటీవల స్పీకర్ సయితం బీఆర్ఎస్ లోనే ఉన్నారని ప్రకటించారు. మరి కాంగ్రెస్ క్రమశిక్షణ చర్యలు ఎలా తీసుకుంటుందని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

## 'బద్రీనాథ్' నిధుల దుర్వినియోగంపై ఉన్నతస్థాయి విచారణ

**డెహ్రాడూన్, జూలై 8:**

ఈ బృందం బుధవారం దర్యాప్తు ప్రారంభించింది. బద్రీనాథ్ ఆలయ ప్రాంగణంలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు ఇప్పటి వరకు భక్తులు హుండీల్లో సమర్పించిన నగదు, ఆన్‌లైన్ విరాళాలు, నగదు నిర్వహణ, లెక్కింపునకు సంబంధించిన విధానాలు, ఇతర పత్రాలను సమీక్షిస్తున్నారు. ఆలయ విరాళాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపరిచేందుకు.. ఆరోపణలపై విచారణ జరిపేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంస్కరణలు తీసుకురావాలని కమిటీకి సూచించారు. బద్రీనాథ్ టెంపుల్ కమిటీ (బీకేటీసీ) ఉత్తరాఖండ్‌లో బద్రీనాథ్‌తో పాటు మరో 44 ఆలయాలు, పలు పాఠశాలలు, ధర్మశాలలను నిర్వహిస్తోంది.



## పుంజుకున్న నైరుతి..

**న్యూఢిల్లీ, జూలై 08 (ప్రజాతీర్పు)**

రుతుపవనాల పురోగతి, ఎల్‌నినో పరిస్థితులపై ప్రధానమంత్రి ప్రధాన సలహాదారు పి.కె.మిశ్రా మంగళవారం విస్తృత సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, తాగునీరు, పారిశుద్ధ్యం, వాణిజ్య వ్యవహారాలు, ఆరోగ్యం కుటుంబ సంక్షేమ, జలవనరుల శాఖల అధికారులు పాల్గొన్న ఈ సమీక్ష సమావేశంలో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) జూన్, జూలై నెలల్లో దేశవ్యాప్తంగా రుతుపవనాల పరిస్థితి, ప్రభావాల గురించి వివరించింది. గుజరాత్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్రల్లో రుతుపవనాల రాక సాధారణం కంటే పది రోజులు ఆలస్యమైనప్పటికీ జూలై ఏడవ తేదీ వరకూ 30 శాతం వర్షం అధికంగా పడిందని, భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. అయితే.. ఎల్‌నినో పరిస్థితులు అన్నిసార్లూ వార్షభావానికి కారణం కాదని స్పష్టం చేసింది. పరిస్థితిని నిత్యం గమనిస్తూ ఉన్నామని తెలిపింది. ఖరీఫ్ సీజన్‌లో ఎల్ నినో పరిస్థితులను తట్టుకునేందుకు ఎలాంటి చర్యలు తీసు కున్నారో కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి వివరించారు. రాష్ట్రాలతోపాటు పంటలు, వాతావరణ శాఖలతో వారం వారం సమావేశాలు నిర్వహిస్తున్నామని, వర్షపా తం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, వ్యవ సాయ పనులు, మార్కెట్ ధోరణలు, పంటలను ఆశిస్తున్న చీడపీడల పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు తెలి పారు. సమస్యాత్మకం కాగల 262 జిల్లాల్లో ప్రత్యామ్నాయ ప్రణాళికలను అందుబా టులో ఉంచామని చెప్పారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రామాణిక పద్ధతులు కొన్నింటిని సిద్ధం చేసిందని వివరించారు. అనానుకూల వాతావరణాన్ని తట్టుకోగల విత్తన వెరైటీలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పాడిపశువులకు దాణ లభ్యతను పరిశీలిస్తున్నామని పశు సంవర్ధక శాఖ అధికారులు తెలపగా.. రిజర్వాయర్లు, భూగర్భ జలాల పరిస్థితిని నిత్యం గమనిస్తున్నామని జల వనరుల శాఖ అధికారులు తెలిపారు. వడగాడ్పుల వంటి పరిస్థితులు ఏర్పడితే ఏం చేయాలన్నదానిపై సూచనలను సిద్ధం చేశామని ఆరోగ్య శాఖ వివరించింది. బియ్యం, గోధుమలు, పప్పుధాన్యాలు, ఖరీఫ్, రబీ సీజన్లకు తగినన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయని వాణిజ్య వ్యవహారాలు, ఎరువుల శాఖ తెలిపింది. వికసిత్ భారత్ పథకం కింద జూలై ఒకటవ తేదీ కింద చేపట్టిన పనులను గ్రామీణాభివృద్ధి శాఖ వివరించింది.

## తెలంగాణలో ధాన్యం సేకరణ కోటా పెంచండి

**దిల్లీ, జూలై 08 (ప్రజాతీర్పు)**

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సేకరించిన ధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పరిమితిని పెంచాలని కోరారు. దీనివల్ల రైతులను ఇబ్బందుల నుంచి గట్టెక్కించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణ కార్యకలాపాలు సాఫీగా సాగడానికి వీలవుతుందని విన్నవించారు. ఆయన బుధవారం ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డిలతో కేంద్ర మంత్రిని కలిసి ఈమేరకు విజ్ఞప్తిచేశారు. ఆ తర్వాత కిషన్‌రెడ్డి తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం నుంచి 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతి ఇచ్చినా రైతులనుంచి సేకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. దానివల్లే రైతులు తీవ్ర ఆందోళనలు వ్యక్తంచేస్తూ రోడ్లపైకి వచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. "రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం, మిల్లింగ్ చేయించి ఎఫ్‌సీఐకి బియ్యం అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. అందుకోసం ఖర్చయ్యే ప్రతి పైసానూ కేంద్రమే చెల్లిస్తుంది. కొనుగోలు, మిల్లింగ్ కోసం పక్కా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ పనిని గాలికొదిలేసింది. తగినన్ని గన్నీ బ్యాగులు, గోదాములు లేవు. సరైన మిల్లింగ్ వ్యవస్థ లేదు. 2024-25 ఖరీఫ్‌లో కేంద్ర ప్రభుత్వం 36 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలుకు అంగీకరిస్తే, ఇంతవరకూ అందులో 13-14% మేర ఇంకా ఎఫ్‌సీఐకి సరఫరా చేయలేదు. అదే ఏడాది రబీ సీజన్ బియ్యాన్ని కూడా పూర్తిగా అందించలేదు. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 44-45% బియ్యం ఎఫ్‌సీఐకి చేరలేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించింది. గతంలోని భారాస ప్రభుత్వమూ ఇలాగే వ్యవహరించింది. కేంద్రంపై నిందలు వేయడం తప్పితే మిల్లింగ్ పరంగా మౌలికవసతుల కల్పనలో గత భారాస, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యాయి. ధాన్యం కొనుగోలుకోసం నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) నుంచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు రుణాలు అందిస్తుంది. ఇందుకోసం గత 12 ఏళ్లలో రూ.1.16 లక్షల కోట్ల రుణాన్ని రాష్ట్రానికి అందించింది. 2025-26లోనే ఎన్‌సీడీసీ ద్వారా రాష్ట్రానికి రూ.37 వేల కోట్ల రుణం అందింది. 2026-27లో ఇప్పటివరకూ రూ.22,700 కోట్ల రుణాన్ని మంజూరుచేసింది. తెలంగాణ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ప్రతి విషయంలో సహకారం అందిస్తున్నా... దిల్లీలో ధర్నా చేయండి, తాము కూడా పాల్గొంటామని కేటీఆర్ అంటున్నారు. కాంగ్రెస్, భారాస కలిసి దిల్లీలో ధర్నాచేస్తే వాస్తవాలు వెల్లడించడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 'మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న చివరి సంవత్సరంలో కొన్నదాని కంటే 6 రెట్లు అధికంగా ధాన్యాన్ని ప్రస్తుతం మోదీ ప్రభుత్వం కొనుగోలు చేసిన విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తించాలి' అని ఎంపీ రఘునందన్‌రావు సూచించారు.




# నకిలీ రసీదులతో భక్తులకు టోకరా!

## అయోధ్య ఆలయ విరాళాల్లో మరో భారీ మోసం

అయోధ్య రామునికి భక్తులు సమర్పించిన కానుకల చోరీ కేసు దర్యాప్తులో సంచలన నిజాలు వెలుగు చూస్తున్నాయి. ఆలయంలో కానుకల అపహరణతో పాటు భక్తుల నుంచి విరాళాల పేరిట పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసేందుకు నకిలీ రసీదు పుస్తకాలు సృష్టించినట్లు విచారణలో తేలింది. పోలీసు వర్గాలు అందించిన సమాచారం ప్రకారం నిందితుల నుంచి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ పేరుతో ఉన్న ఒక నకిలీ రసీదుల పుస్తకాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆలయ కానుకలను కాజేయడమే కాకుండా, అధికారిక విరాళాల పేరుతో భక్తులను నమ్మించి, నకిలీ రసీదుల ద్వారా పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేసినట్లు నిందితులు విచారణలో అంగీకరించారు. భక్తులు ఎవరైనా విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తే, నిందితులు ఈ నకిలీ రసీదులను జారీ చేసేవారని, దీంతో భక్తులు అవి అధికారిక రసీదులేనని నమ్మివుంటారని పోలీసులు భావిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న రసీదు పుస్తకాలు 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్'కు చెందిన పాత కాపీలు మాదిరిగా ఉన్నాయని పోలీసులు తెలిపారు.



# వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహింపు

**కుత్బుల్లాపూర్, జులై 8 (ప్రజా తీర్పు )**

నియోజకవర్గంలోని ప్రగతి నగర్ కూడలిలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ 276వ డివిజన్ అధ్యక్షులు తాతిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి హాజరై, వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ ప్రజా సంక్షేమ పాలనకు చిరస్మరణీయ నాయకుడని, రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల అభ్యున్నతికి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మర్రి ప్రశాంత్ రెడ్డి, గంగిరెడ్డి అది రెడ్డి, మద్ది నారాయణ రెడ్డి, దాసరి మహేష్, చల్ల సందీప్ రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వై ఎస్ సేవలు చిరస్మరణీయం

## ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 8.**

ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా.వై ఎస్ రాజశేఖర్ రెడ్డి గారి 77వ జయంతి సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారి చిత్ర పటానికి పూలు సమర్పించి ఘన నివాళులు అర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య గ,కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్గీయ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయంగా తలుస్తాయని, ఆయన ఆశయ సాధనలో మనం ముందుకు వెళ్లాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కె డి సి సి జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రాంచందర్ రావు ,సీనియర్ నాయకులు బండ శంకర్, మన్సూర్ ,ఖఎష చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి ,సమిండ్ల శ్రీనివాస్, చాంద్ పాషా,జిల్లా యూత్ అధ్యక్షులు భీరం రాజేష్ ,బొలిశెట్టి గంగారెడ్డి,కట్ట రాజేందర్,జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్, పాక్స్ చైర్మెన్ నరసింహ రెడ్డి, బీర్పూర్ మండల అధ్యక్షులు నారపాక రమేష్, శేఖర్ రెడ్డి,

సాయి,దయల శరత్,శేఖర్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు,పట్టణ ,మండల నాయకులు,యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పిట్లం నేతకు రాష్ట్ర స్థాయి బాధ్యతలు

**పిట్లం / జూన్ 8 ( ప్రజా తీర్పు )**

కాంగ్రెస్ పార్టీలో పిట్లంకు చెందిన సాయిలుకు కీలక బాధ్యతలు దక్కాయి.ఆయనను టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారిక నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు ఎస్సీ విభాగాన్ని



చురుకుగా ముందుకు తీసుకెళ్లేందుకు సాయిలు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు దక్కడం పట్ల సాయిలు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, టీపీసీసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ అభివృద్ధి, ఎస్సీ విభాగం బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.ఈ నియామకం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

# విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు, మంచిర్యాల మండల్) జూలై 8**



గోదావరిఖని లోని రీజినల్ కమీషనర్ (సీ ఎం పీ ఎఫ్) కార్యాలయం లో బెల్లంపల్లి , మందమర్రి , శ్రీరాంపూర్ మరియు సింగరేణి ఇతర ఏరియా లలో సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఎదురుకునే సమస్యలను పరిష్కరించాలని అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్ గారికి మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ప్రతి నెల 1 వ తారీఖు రోజున వివిధ బ్యాంకు లలో ఖాతాదారులైన బొగ్గు పెన్షన్ దారులకు వారి వారి ఖాతాలలో పెన్షన్ జమ అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని , ఈ నెల (ఎ స్ బీ ఐ) ఖాతాదారులకు 1 వ తేదీ న కాకుండా 3 తారీఖు న పెన్షన్ వారి ఖాతాలో జమ కావడం మూలాన అతి తక్కువ పెన్షన్ పొందుతున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులు నానా రకాలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదురుకున్నారని , అదే విధంగా వేలాది మంది విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పీపీఓ) కాపీ లు అందలేదని కావున పీపీఓ ఆర్డర్ లు రాని వారికి వెంటనే ఇప్పించే ఏర్పాటు చేయగలరని , పదవీ విరమణ చేస్తున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగుల క్లెయిమ్స్ ను జాప్యం కాకుండా త్వరగా పరిష్కరించాలని గోదావరిఖని లోని (సీ ఎమ్ పీ ఎఫ్)అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్ కు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఇచ్చిన వినతి పత్రం పై సానుకూలంగా స్పందించిన అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్ విశ్రాంత ఉద్యోగుల ఎదురుకునే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న , అధ్యక్షులు గజెల్లి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, ఉపాధ్యక్షులు ఏ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.




# నాణ్యమైన విద్యను అందించాలి

## జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 8.**

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు)రాజా గౌడ్ అన్నారు బుధవారం స్థానిక ఓల్డ్ హైస్కూల్ జగిత్యాల లో జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహించే ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల పైన విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కల్పించాలని వారన్నారు గత సంవత్సరం ఎస్ఎస్సి ఫలితాల్లో అత్యున్నత ఫలితాలు సాధించినందుకు ఉపాధ్యాయులను అభినందించారు పాఠశాలలో మౌలిక సదుపాయాల కొరకు ఇజిఎస్ మరియు డిఎంఎఫ్టి నిధులు కేటాయిస్తున్నాము అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థుల సంఖ్య రాష్ట్రంలో మన జిల్లా రెండవ స్థానంలో ఉందని అంతేకాకుండా మూతబడ్డ పాఠశాలలను పున ప్రారంభం చేయడంలో మన జిల్లా రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో ఉందని అంతేకాకుండా అందులో చేరిన విద్యార్థుల సంఖ్యలో రాష్ట్రస్థాయిలోప్రథమ స్థానంలో ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి మండల విద్యాధికారి చంద్రకళ పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయిని పెల్లి ఆనంద్ రావు రిసోర్స్ పర్సన్స్ లు పరమేశ్వర్ జగదీశ్వర్ రాజకుమార్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా అన్నదాన కార్యక్రమం

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జూలై 08**

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని, ఎన్ఎస్ యుఐ జిల్లా మాజీ అధ్యక్షులు మునిగంటి అనిల్ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ బస్టాండ్ ఎదురుగా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి కరీంనగర్ డీసీసీ అర్బన్ అధ్యక్షులు అంజన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకులు అగరభట్ల రెడ్డి , మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న , మహిళా కాంగ్రెస్ నగర అధ్యక్షురాలు రజిత రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు పోలె కుమారయ్య, లక్ష్మణ్ శరత్ చంద్ర రామ్ ప్రసాద్ తాళ్ల దిలీప్ చెర్ల పద్మ చెర్ల పవన్ తేజస్ అజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, అభిమానులు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. డాక్టర్ నరేందర్ రెడ్డి సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలు, ఐశ్వర్యం, విజయాలతో నిండి, మరెన్నో సంవత్సరాలు ప్రజలకు, విద్యారంగానికి సేవలందించాలని భగవంతుడిని ప్రార్థించారు.



# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 8.**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని 37 వార్డులో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, బి.ఎల్.వో లు పాల్గొన్నారు.

# నిరంజన్ అంత్యక్రియలో పాల్గొన్న జనసేన పార్టీ వరంగల్ జిల్లా నాయకులు,నర్సంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ శివకోటి యాదవ్

**నర్సంపేట జూలై 8 ప్రజా తీర్పు**

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం, తెలంగాణ రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకు. వరంగల్ జిల్లా జనసేన నాయకులు గడ్డం రాకేష్,మేరుగు శివకోటి యాదవ్,గాదే పృధ్వి,బర్ల శివ



నిరంజన్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది. అలాగే నిరంజన్ తల్లిదండ్రుల కోరిక మేరకు పార్థివ దేహంపై జనసేన జెండా కప్పడం జరిగింది. ఈ సందర్భంగా శివకోటి యాదవ్ లినిరంజన్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పంపిన సందేశాన్ని అంత్యక్రియలో చదివి, పవన్ కళ్యాణ్ ఉన్న బిజీ షెడ్యూల్ వల్ల, సమయాభావం లేకపోవడంతో రాలేకపోతున్నాడని,నిరంజన్ అంత్యక్రియనిరంజన్, ఖర్చులకు తానే స్వయంగా చేసుకుంటానని, కుటుంబ సభ్యులకు భరోసాగా ఉంటాడని చెప్పడం జరిగింది అలాగే ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కందికొండ రామ్ చరణ్,ఎలబోయిన డేవిడ్, అజ్మీర రాజేందర్, అనుదీప్, సురేష్, అభిలాష్, దయాకర్, క అంజి,శివాజీ, శ్రావణ్ జనసైనికులు, తదితరులు పాల్గొనడం జరిగింది.

# తల్లికున్న సత్సంస్కారమే బిడ్డ పాలిట వరం

## డాక్టర్ ఎడవల్లి శైలజ

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జులై 08**



శిశువు పరిపూర్ణ వికాసానికి కావలసిన బీజం తల్లి గర్భంలో ఉన్నప్పుడే పడాలని, తల్లికున్న సత్సంస్కారమే బిడ్డ పాలిట వరం అవుతుందని డాక్టర్ ఎడవల్లి శైలజ అన్నారు. హైదరాబాద్ రామకృష్ణ మఠం, కరీంనగర్ శివానంద హాస్పిటల్ డాక్టర్ ఎడవల్లి శైలజ సంయుక్త నిర్వహణలో ఆర్య జనని పేరున బుధవారం కరీంనగర్‌లోని వైశ్యభవన్‌లో గర్భిణి స్త్రీలకు ఉచిత అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ తల్లి ఆలోచనలు, చేసే పనులు, మాట్లాడే మాటలు, మానసిక స్థితి అన్ని కూడా శిశువును ప్రభావితం చేస్తాయన్నారు. శిశువు ఈ ప్రపంచంలోకి రాకముందు ఉన్న పరిస్థితులే తరువాత శిశువు వ్యక్తిత్వాన్ని , గుణసంపదను నిర్ణయిస్తాయన్నారు. తల్లిలోని నకారాత్మక భావాలు, ఆందోళన శిశువు శారీరక, మానసిక ఆరోగ్యంపై వ్యతికేక ప్రభావం చూపుతాయన్నారు. ఈ వ్యతిరిక్తత తొలగించుకోవడానికి తల్లి మధురమైన, మార్దవమైన సంగీతాన్ని వినాలని, సమతుల ఆహారం,యోగాసనాలు శరీరాన్ని చక్కగా ఉంచుతాయన్నారు. సంస్కారవంతులైన, దైవం పట్ల భక్తిశ్రద్ధలు కలిగిన తల్లులు ఉన్న ఇండ్లలోనే ఉన్నతమైన వ్యక్తులు జన్మిస్తారన్నారు. బిడ్డ పుట్టుకతోనే సంస్కార సిరిని, జ్ఞానసంపదను అందిపుచ్చుకునేలా చేయగలిగితే జీవితం సాఫీగా సాగుతుందన్నారు.శిశువు మహోన్నత వ్యక్తి కావాలంటే తల్లి గర్భంలో ఉన్నప్పుడే సంస్కారం అందాలన్నారు. విజయవాడ రామకృష్ణ మిషన్ కార్యదర్శి, కార్యక్రమ ఆర్య జనని సృష్టికర్త స్వామి శితికంఠానంద మహారాజ్ మాట్లాడుతూ బిడ్డను కనబోతున్న స్త్రీ ఉత్తమమైన తల్లిగా రూపుదిద్దుకొని గర్భంలో ఉన్న శిశువు సర్వ సద్గుణ సంపన్నులుగా పుట్టేటట్లు చేయడానికి సహాయాన్ని అందించడమే అర్యజనని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఆర్యజనని ట్రస్ట్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అనుపమ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ తల్లి మనోశరీరాలపై వ్యతిరిక్త ప్రభావాలు కలిగించే విధంగా పరిసరాలు, ఆహారం, కుటుంబ వ్యవస్థ ఉంటే అవన్నీ గర్భస్థ సమయంలో పిండం మీద ప్రభావం చూపి బిడ్డ ఎదుగుదలకు ఆటంకాలౌతాయన్నారు. తల్లి యొక్క భక్తి విశ్వాసాలపైనే శిశువుకు సంక్రమించే సంస్కారం ఆధారపడి ఉంటుందని ఆ సంస్కారం శిశువు పూర్ణవికాసానికి దోహదపడుతుందన్నారు. ఈ సదస్సులో సుడా చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి, డాక్టర్ ఎడవల్లివిజయేంద్ర రెడ్డి, జిల్లా మహిళ సంక్షేమాధికారి ఎం.సరస్వతి తదితరులు పాల్గోనగా దాదాపు 800కు పైగా గర్భిణీ స్త్రీలు, మహిళలు పాల్గోన్నారు.

# వైఎస్ఆర్ స్ఫూర్తితో రాష్ట్రంలో సంక్షేమ పరిపాలన

## డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జులై 8**




మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా బుధవారం స్థానిక డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య తదితరులతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అతి చిన్న వయసులో శాసనసభకు ఎన్నికై మంత్రిగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా, రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడిగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎన్నో సేవలు చేసినట్టు పేర్కొన్నారు. 2003లో రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘమైన పాదయాత్ర చేపట్టి 2004లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహద పడినట్టు చెప్పారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత దేశంలోనే సంక్షేమం అనే పదానికి పూర్తి చిరునామాగా నిలిచారని కొనియాడారు. ఆయన హయాంలో పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు, ఫీజు రియంబర్స్మెంట్, రైతాంగానికి ఉపయోగపడే విధంగా జలయజ్ఞం ద్వారా అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడం జరిగినట్టు గుర్తు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, వరద కాలువల నిర్మాణం చేపట్టి రాష్ట్ర రైతాంగానికి అండగా నిలిచిన గొప్ప నాయకుడు రాజశేఖర్ రెడ్డి అని కీర్తించారు. వైఎస్ హయాంలోనే కరీంనగర్ జిల్లాలో శాతవాహన యూనివర్సిటీ, చొప్పదండి నియోజకవర్గంలో జేఎన్టీయూ లాంటి ఎన్నో విద్యాసంస్థలు నెలకొల్పడం ద్వారా ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడిగా నేటికీ కీర్తించబడుతున్నట్టు తెలిపారు. దురదృష్టవశాత్తు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించి రాష్ట్ర ప్రజలను ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులను శోకసముద్రంలో ముంచినారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమ పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. రాజశేఖర్ రెడ్డి చూపిన పోరాటపటిమను ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అందిపుచ్చుకోవాలని సత్యం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి ఎండి తాజ్ మడుపు మోహన్ కర్ర సత్య ప్రసన్న బానోతు శ్రావన్ నాయక్ వెన్న రాజమల్లయ్య సిరాజ్ హుస్సేన్ సురేందర్ రెడ్డి ముదుగంటి గంట శ్రీనివాస కళ్యాణి కాంతాల జగన్ రెడ్డి చర్ల పద్మ గుండాటి శ్రీనివాస్ రెడ్డి వంగల విద్యాసాగర్ దిండిగాల మధు మాదాసు శ్రీనివాస్ కుంభాల రాజు కుమార్ కల్వల రామ్ చందర్ షబానా మహమ్మద్ పోరండ్ల రమేష్ గడప శ్రీనివాస్ మంద మహేష్ శిల్ప స్వప్నశ్రీ అందే శంకర్ తోట అంజయ్య భారీ మూల కృష్ణారెడ్డి నూనె గోపాల్ రెడ్డి మాలోతు మహాలక్ష్మిహైమద్ మహమ్మద్ చాంద్ గన్ను మహేందర్ రెడ్డి హనీఫ్ జొన్నల రమేష్ ముక్క భాస్కర్ సత్తినేని శ్రీకాంత్ విక్టర్ శారద కట్టెకోల ప్రభాకర్ జ్యోతి రెడ్డి కాంపల్లి కీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఏరియా ఆస్పత్రి కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) జూలై 8**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో హెల్త్ డిపార్ట్మెంట్లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ కార్మికులకు ఇప్పటికీ హెల్త్ కార్డులు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. వారికి వెంటనే హెల్త్ కార్డులు మంజూరు చేయడంతో పాటు ఇ ఎస్ ఐ. పి ఎఫ్. వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా, గౌరవ సుప్రీంకోర్టు పేర్కొన్న "సమాన పనికి సమాన వేతనం" సూత్రాన్ని అమలు చేసి, కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని, రూ.25 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండారి హరీష్, మారవేణి మహేష్, శ్రీనివాస్, నాగరాజు, మౌనిక, మమత, కృష్ణవేణి, శారద, కళ, రాజేశ్వరి, రాజేష్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## గృహప్రవేశానికి హాజరైన డిసిసి అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్

**నిజాంసాగర్ / జులై 08 ( ప్రజా తీర్పు )**

నిజాంసాగర్ మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ గృహ లబ్ధిదారుడు కురుమ సిద్ధి రాములు నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, నిరుపేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. నూతన గృహప్రవేశం చేసిన కుటుంబ సభ్యులు డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొని గృహ యజమానికి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో ఆత్మీయవాతావరణంలో కార్యక్రమం నిర్వహించారు.

## తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా వేముల రమ్య

**జమ్మికుంట జూలై 08 ప్రజాతీర్పు**



తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా జమ్మికుంట మండల కేంద్రానికి చెందిన వేముల రమ్యను రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ నియమించారు. హైద్రాబాద్ లో జరిగిన రాష్ట్ర కమిటీ సర్వసభ్య సమావేశం లో రమ్య కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ మాట్లాడుతూ, చేనేత కార్మికుల సంక్షేమం కోసం వేముల రమ్య సమర్థవంతంగా పనిచేస్తారనే విశ్వాసంతో ఆమెకు రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వేముల రమ్య మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్, రాష్ట్ర కోశాధికారి జెల్ల రఘు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎలిగేటి శ్రీనివాస్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం, మహిళా చేనేత కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో కృషి చేస్తానని చెప్పారు. సంస్థ బలోపేతంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మహిళా విభాగాన్ని మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.




## గుండె పోటుతో మృతి చెందిన మలిదశ ఉద్యమకారుడు వీరాస్వామి కుటుంబాన్ని ఆదుకోవాలి

### వీరాస్వామి మృతదేహం పై పూల మాలలతో సిపిఎం నివాళులు

**(పగడాల రామారావు ప్రజా తీర్పుల ప్రతినిధి గార్ల మండల ప్రతినిధి) జూలై 8**

గార్ల: గుండె పోటుతో మృతి చెందిన తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమకారుడు పిల్లలమర్రి వీరస్వామి కుటుశీబాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్ధికంగా అదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ కోరారు. స్థానిక మండల కేంద్రం లోరైల్వే సైకిల్ స్టాండ్ నడుపుతూ జీవనం సాగిస్తున్న వీరస్వామి హార్ట్ స్ట్రోక్ తో బుధవారం తెల్ల వారు జామున మరణించగా, గండి గ్రామంలోని వీరస్వామి ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వీరాస్వామి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతి చెందిన మలి దశ ఉద్యమకారుడు వీరస్వామి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి, వీరస్వామి భార్య కు జీవనోపాధి నిమిత్తం ఔట్ సోర్సింగ్ జాబ్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, నాయకులు వి.వెంకటేశ్వర్లు, ఐ గోవింద్, సిహెచ్.మౌనిక,వి. కొండయ్య,ఎస్ నాగరాజు, జీవంచిపల్లి గిరి, తదితరులు ఉన్నారు.

## ట్రాన్స్ ఫార్మర్ తో పొంచి ఉన్న ప్రమాదం

### రక్షణ కంచె లేకపోవడంతో అనర్థాలు జరిగే అవకాశం

**హుస్నాబాద్ జులై 08 (ప్రజాతీర్పు)**




సాధారణంగా ట్రాన్స్ ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలి. లేదంటే తరచుగా విద్యుదాఘాతాలు జరిగి ప్రాణం పోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇదంతా ఎందుకు చెప్పవలసి వస్తుందంటే, హుస్నాబాద్ మండలంలోని మాలపల్లి గ్రామంలో గౌరవెల్లి కి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి పక్కనే ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేశారు. కానీ రక్షణ కంచె ( ప్రొటెక్టివ్ ఫెన్సింగ్) మాత్రం ఏర్పాటు చేయలేకపోయారు విద్యుత్ అధికారులు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభమేముంది అనే విధంగా ముందుగానే ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి. కానీ అలా చేయకుండా వదిలిపెట్టేశారు. ప్రాణ నష్టం జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు స్థానికులు. అసలే వర్షాకాలం ట్రాన్స్ ఫార్మర్ల చుట్టూ పశువులు, మనుషులు వెళ్లకుండా విద్యుత్ షాక్ తగలకుండా విద్యుత్ అధికారులు చేసినట్లయితే ప్రజల ప్రాణాలను రక్షించే వారవుతారు. కాబట్టి ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నామినేటెడ్ పదవికై ముఖ్యమంత్రికి వినతి

**కరీంనగర్, జూలై 08 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



ఎంతో కాలంగా పెండింగ్లో ఉన్న రాష్ట్ర జిల్లాస్థాయి నామినేటెడ్ పదవుల భర్తీకి మార్గం సుగమము అవడంతో కరీంనగర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరగోని శ్రీనివాస్ గౌడ్ తనకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవిని నామినేట్ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతున్నారు తను సుదీర్ఘకాలం నాలుగు దశాబ్దాలుగా పార్టీలో ఉంటూ సేవలు చేశానని గత ఎన్నికలలో పార్టీ విజయానికి పొన్నం ప్రభాకర్,కావ్వంపల్లి సత్యనారాయణ తదితర ఎమ్మెల్యే అభ్యర్థులందరి నియోజకవర్గాల్లో తిరిగి వారి గెలుపుకు ఎంతో కృషి చేశానని తనకు వాటికి గుర్తింపుగా నామినేటెడ్ పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు అలాగే ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర రవాణా బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లకు వినతి పత్రాన్ని సమర్పించారు తప్పనిసరిగా తనకు గుర్తింపునిచ్చి నామినేటెడ్ పదవి కేటాయిస్తే పార్టీకి మరింత సేవలు చేస్తూ రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు.



## నల్లెల్ల స్టేజి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- స్కూల్ బస్సు ఢీకొన్న లారీ, విద్యార్థులకు గాయాలు

**కురవి జులై 08 (ప్రజా తీర్పు విలేఖరి)**

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన నాగార్జున ప్రైవేట్ స్కూల్ బస్సు నల్లెల్ల స్టేజి వద్ద రోడ్డు ప్రమాదానికి గురైంది. స్థానికుల కథనం ప్రకారం, బస్సు డ్రైవర్ అతివేగంగా,నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల ఎదురుగా వచ్చిన లారీని ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 40 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడగా,వారిని వెంటనే మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అదే క్రమంలో ఓ కార్యక్రమానికి అటుగా వెళ్తున్న డోర్నకల్ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ డా.రామచంద్రు నాయక్ ఆగి ప్రమాదం జరిగిన బస్సు ను పరిశీలించారు. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులు లింగ్యతండా గ్రామానికి చెందిన వారిగా ప్రాథమిక సమాచారం వెల్లడైంది. ప్రమాదం అనంతరం స్థానికులు సీరోలు,కురవి ఎస్సై లు జి.సంతోష్,బి.సతీష్ లు కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానిక కురవి తహసీల్దార్ విజయ ప్రమాదం జరిగిన వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన విద్యార్థులను అత్యవసర చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల అసలు కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి గాయపడిన విద్యార్థుల సంఖ్య,వారి ఆరోగ్య పరిస్థితి,ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించిన 30వ కౌన్సిలర్ మాదాసి రవి

**నర్సంపేట జూలై 8 ప్రజా తీర్పు**

నర్సంపేట పట్టణం 30వ వార్డుకు సంబంధించిన బిర్రు విజయలక్ష్మి కీ చెందిన 17,500/- రూపాయల చెక్కుకు నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు పెద్దలు దొంతి మాధవరెడ్డి సహకారంతో నేడు అందించిన నర్సంపేట పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, 30వ వార్డు కౌన్సిలర్ మాదాసి రవి ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పంబి వంశీకృష్ణ, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బైరి మురళి, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, పెద్దపల్లి శ్రీనివాస్, నాగెల్లి సారంగం, పిన్నింటి కిరణ్ కుమార్ రెడ్డి, గోపు మహేందర్ రెడ్డి, మేరుగు కిరణ్, దేశి సాయి పటేల్, మచ్చకంటి మనోజ్ కుమార్ పాల్గొన్నారు..

# 21వ డివిజన్ లో అభివృద్ధి పనులను ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జులై 08**



నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా 21వ డివిజన్‌లో రూ.39.80 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించిన సిసి రోడ్డు, డ్రైనేజీ పనులను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మించిన రహదారి, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి పనుల నాణ్యతపై అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే 9వ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. నగరంలోని ప్రతి కాలనీకి సమాన ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను గుర్తించి సత్వరమే పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే కరీంనగర్‌ను పరిశుభ్రమైన, సుందరమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దగలమని అన్నారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసిన మేయర్, అధికారులు ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రజలు తమ ప్రాంతంలో నాణ్యమైన అభివృద్ధి పనులు చేపట్టినందుకు నగర మేయర్ శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, 21వ డివిజన్ కార్పొరేటర్ వరాల నర్సింగం , 22వ డివిజన్ కార్పొరేటర్ బండ రమణారెడ్డి , పడిశెట్టి భూమయ్య మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# షానగర్ సర్పంచ్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరిక

**రామడుగు, జూలై 8 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరో ఊతం లభించింది. రామడుగు మండలంలోని షానగర్ గ్రామ సర్పంచ్ గునుకొండ శైలజ, మాజీ సర్పంచ్ గునుకొండ అశోక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గంగాధర ప్రజా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర అసెంబ్లీ ఎస్సీ సంక్షేమ కమిటీ చైర్మన్ డా. మేడిపల్లి సత్యం వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చొప్పదండి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, షానగర్ గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, సర్పంచ్ అనంతరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కోల రమేష్, బాలా గౌడ్, నర్సింగం, వార్డు సభ్యులు కొత్త రమ్యకృష్ణ, పార్లపల్లి సురేష్, పార్లపల్లి నరేష్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కొత్త అనిల్, చిరుత శ్రీధర్, మిణుకుల వెంకటేష్, బేతి చిరంజీవి, గోలి మునీధర్‌తో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.



# శిథిలమైన బుద్ధారం రోడ్డును తక్షణం మరమ్మతు చేయాలి

సిపిఐ గార్ల మండల కమిటీడిమాండ్.

**(పగడాల రామారావు ప్రజాతీర్పు గార్ల మండల ప్రతినిధి( జులై 8**

గార్ల:- బుద్ధారం గ్రామపంచాయతీ, బుద్ధారం తండా వద్ద 3 సంవత్సరాల క్రితం చేపట్టిన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం 99% పూర్తయినప్పటికీ అధికారులు అరకొర పనులు మిగిల్చి బ్రిడ్జిని ప్రారంభించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు .బుద్ధారం తండ హై లెవెల్ బ్రిడ్జి నుండి బుద్ధారం గ్రామానికి వెళ్లడానికి దశాబ్దం క్రితం వేసిన రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఇప్పటికే అనేక సందర్భాల్లో వాహనాలు బోల్తా కొట్టి ప్రమాదాలు జరిగి ప్రజలు గాయపడ్డారు.అయినప్పటికీ సంబంధిత అధికారులు బుద్ధారం రోడ్డును పట్టించుకోకపోవడం ప్రజా వ్యతిరేక చర్య.

**మా డిమాండ్లు:**

1. 99% పూర్తైన బుద్ధారం హై లెవెల్ బ్రిడ్జి మిగిలిన పనులను 15 రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.
2. శిథిలమైన బుద్ధారం గ్రామ రోడ్డును వెంటనే కొత్తగా నిర్మించాలి.
3. రాకపోకలకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి.

పై సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించకుంటే సిపిఐ ఆధ్వర్యంలో బ్రిడ్జి వద్ద రాస్తారోకో, ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, భూక్య హరినాయక్, ధరావత్ వీరన్న, అన్నం శ్రీనివాసరావు, జి బీముడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చిగురుమామిడి యువతకు సువర్ణావకాశం

- పోలీస్ ఉద్యోగాలకు సన్నద్ధం కావాలి

**హుస్నాబాద్ చిగురుమామిడి, జూలై 08 (ప్రజాతీర్పు)**



తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే పోలీస్ శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్న నేపథ్యంలో, చిగురుమామిడి మండలానికి చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిగురుమామిడి సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్ఐ బి. జగదీశ్వర్ పిలుపునిచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగం అనేది కేవలం ఒక ప్రభుత్వ ఉద్యోగం మాత్రమే కాదని, సమాజంలో అత్యంత గౌరవప్రదమైన స్థానంతో పాటు నేరుగా ప్రజలకు సేవ చేసే ఒక గొప్ప అవకాశమని ఆయన పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడకుండా ఇప్పటి నుంచే తమ ప్రిపరేషన్‌ను ప్రారంభించాలని సూచించారు.

### క్రమశిక్షణతో కూడిన సాధన అవసరం

పోలీస్ ఉద్యోగానికి ఎంపికవ్వాలంటే శారీరక దారుఢ్యంతో పాటు మానసిక సన్నద్ధత కూడా అంతే ముఖ్యమని ఎస్ఐ జగదీశ్వర్ అన్నారు. అభ్యర్థులు ఇప్పటి నుంచే రోజూ ఉదయం శారీరక దారుఢ్య పరీక్షల కోసం రన్నింగ్, ఇతర ఈవెంట్స్ సాధన చేయాలని, అదే సమయంలో లిఖిత పరీక్షల వ్రైతన్ రైటేన్ ఎగ్జామ్స్ కోసం ఒక ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో చదవడం ప్రారంభించాలని ఆయన స్పష్టం చేశారు. అధికారిక నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అందులోని నిబంధనలు, విద్యార్హతలు, వయోపరిమితి మరియు దరఖాస్తు విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### అభ్యర్థులకు అండగా ఉంటాం..

చిగురుమామిడి మండల యువతకు పోలీస్ ఉద్యోగాలపై ఎలాంటి సందేహాలున్నా, పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో తెలియకపోయినా తగిన సలహాలు, సూచనలు మరియు మార్గదర్శకత్వం గైడెన్స్ అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ఎస్ఐ జగదీశ్వర్ భరోసా ఇచ్చారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎప్పుడైనా తన్ను నేరుగా సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. తమ చిగురుమామిడి మండలం నుండి ఈసారి అత్యధిక సంఖ్యలో యువతీ యువకులు తెలంగాణ పోలీస్ శాఖకు ఎంపికై, ప్రజాసేవలో భాగస్వాములు కావాలని ఆయన హృదయపూర్వకంగా ఆకాంక్షించారు. ఈ అవకాశాన్ని మండల యువత చేజార్చుకోవద్దని ఆయన ఈ సందర్భంగా హితవు పలికారు.

# హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఘోరం





- పరీక్షల వేళ విద్యార్థులతో 'వెట్టిచాకిరి'!
- నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ కమిషనర్ విద్యార్థులతో డాటా అప్లోడింగ్
- మొబైల్ యాప్‌లో డేటా అప్‌లోడింగ్ సాకుతో ఒత్తిడి
- వారంలో పరీక్షలున్నా పట్టించుకోని వైనం

**సిద్దిపేట్ జిల్లా హుస్నాబాద్ జూలై 08 (ప్రజాతీర్పు)**

హుస్నాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో నిబంధనల ఉల్లంఘన పరాకాష్టకు చేరింది. చదువుకోవాల్సిన విద్యార్థులను మున్సిపల్ కమిషనర్ వెట్టిచాకిరీకి వాడుకుంటున్నారు. పట్టణంలో బీఎల్ఓ, బీఎల్ఏలు సేకరించిన ఫారాల డేటాను ఆన్‌లైన్ చేసేందుకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను పావుగా మార్చారు. వారి మొబైల్ ఫోన్లలో 'సార్ యాప్' డౌన్‌లోడ్ చేయించి, ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి మరీ డేటా అప్‌లోడింగ్ చేయిస్తున్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాల్సిన ఈ బాధ్యతను విద్యార్థులపై నెట్టేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### చదువుకు ఆటంకం.. మానసిక ఒత్తిడి!

ఈ పనుల వల్ల విద్యార్థుల రోజువారీ తరగతులు, విలువైన చదువు కాలం వృథా అవుతోంది. మరో వారం రోజుల్లో సెమిస్టర్ పరీక్షలు, ల్యాబ్స్ ప్రారంభం కానున్నాయని, ఈ తరుణంలో విద్యార్థులను పనులకు పంపడం వారి భవిష్యత్తుతో ఆడుకోవడమేనని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

### స్పందించని అధికారులు..

ఈ వ్యవహారంపై ప్రజాతీర్పు ప్రతినిధి అధికారులను సంప్రదించగా బాధ్యతారాహిత్య సమాధానాలు ఎదురయ్యాయి. స్థానిక ఆర్డీవో ను వివరణ కోరగాఈ విషయంపై ఎలాంటి అవగాహన లేదని చేతులెత్తేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. విద్యార్థులను కేవలం గంట కోసమే పంపామని, కానీ వారితో ఇలా యాప్ ద్వారా పనులు చేయిస్తున్న విషయం తనకు తెలియదన్నారు. త్వరలో పరీక్షలు ఉన్న మాట వాస్తవమేనని ఆమె ధృవీకరించారు. ప్రభుత్వ డేటాను విద్యార్థుల వ్యక్తిగత మొబైల్ యాప్‌ల ద్వారా అప్‌లోడ్ చేయించడం నిబంధనలకు విరుద్ధం. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, పరీక్షల వేళ విద్యార్థులను ఈ పనుల నుండి విముక్తి చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



# క్యూబా రిపబ్లిక్ రాయబారిని కలిసిన పెద్దపల్లి ఎంపీ జి. వంశీ కృష్ణ గడ్డం

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 8**

పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ పార్లమెంటు సభ్యులు శ్రీ జి. వంశీ కృష్ణ గడ్డం ఈ రోజు న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసంలో క్యూబా రిపబ్లిక్ రాయబారి జువాన్ కార్లోస్ మార్సాన్ అగ్విలెరాను,మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా క్యూబాలోని ప్రస్తుత పరిస్థితులు, అలాగే భారతదేశం క్యూబా దేశాల మధ్య కొనసాగుతున్న ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలను మరింత విస్తరించడం, ప్రజల మధ్య పరస్పర సంబంధాలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా జి. వంశీ కృష్ణ గడ్డం భారతదేశం క్యూబా మధ్య ఉన్న చారిత్రాత్మక, సుదీర్ఘ స్నేహబంధాన్ని స్మరించుకున్నారు. ముఖ్యంగా భారత మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ మరియు క్యూబా మాజీ అధ్యక్షుడు ఫిడెల్ కాస్ట్రో గారి మధ్య నెలకొన్న స్నేహపూర్వక సంబంధాలు ఇరు దేశాల ద్వైపాక్షిక సహకారానికి బలమైన పునాది వేశాయని పేర్కొన్నారు.అలాగే తన తాతగారైన దివంగత శ్రీ కాకా వెంకటస్వామి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా మరియు శ్రీమతి ఇందిరా గాంధీ కి అత్యంత సన్నిహిత సహచరుడిగా భారతదేశం క్యూబా సంబంధాలు బలోపేతమైన ఆ చారిత్రక కాలానికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచారని గుర్తు చేశారు. ఆ వారసత్వ స్ఫూర్తిని కొనసాగిస్తూ, రెండు దేశాల మధ్య సహకారం, పరస్పర అవగాహన మరియు ప్రజల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరిగిందని, భారత్ క్యూబా సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే దిశగా ఇటువంటి సమావేశాలు దోహదపడతాయని ఎంపీ జి. వంశీ కృష్ణ గడ్డం పేర్కొన్నారు.

# బద్రీనాథ్ ఆలయ ఉద్యోగి సస్పెండ్

బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయంలో విరాళాల అక్రమాలపై కీలక పరిణామం చోటు చేసుకుంది. నలుగురు సభ్యులతో కూడిన టీమ్ విచారణ ప్రారంభించిన రెండోరోజే ఆలయ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. విరాళాల అక్రమాలు జరిగినట్టు పలు ఆధారాలు లభించడంతో కమిటీలో ప్రైవేట్ కార్యదర్శిగా పనిచేస్తున్న ప్రమోద్ నౌటియాల్‌ను సస్పెండ్ చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ హేమంత్ ద్వివేదీ తెలిపారు. ద్వివేదీ మాట్లాడుతూ.. ఎవరైనా తప్పు చేసినట్టు విచారణలో తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కమిటీ 15 రోజుల్లో విచారణ జరిపి నివేదిక ఇవ్వనుంది. ఆలయ విరాళాల్లో అక్రమాలు జరిగాయని సోషల్ మీడియాలో ఆరోపణలు రావడంతో విచారణ కోసం ఆలయ కమిటీ నలుగురు సభ్యుల కమిషన్ వేసింది.

# జర్నలిస్టుల భూమిని వెంటనే వారి కి కేటాయించాలి

ఉద్యమకారుల వేదిక జిల్లా అధ్యక్షులు గోగర్ల రాజేశం డిమాండ్

**(వి వెంకటేష్ ప్రజా తీర్పు జిల్లా స్టాఫ్ రిపోర్టర్) జులై 8**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల శివారులోని పత్రిక రిపోర్టర్లకు ఏ భూమైతే వల్ల స్వాధీనంలో ఉన్నదో అది వెంటనే పత్రిక రిపోర్టర్లకు కేటాయించాలి గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో పత్రికా రిపోర్టర్ల కారణంగానే తెలంగాణ ఉద్యమం కిందిస్థాయి నుండి పై స్థాయి దాకా ఉధృతం రావడానికి పాత్రికేయులు ఎంతో కృషి చేసినారు. కావున వాళ్లు ఏదైతే ప్రభుత్వ భూమి పాతికే యుస్వాధీనంలో ఉందో దానిని వెంటనే ప్రభుత్వము పాత్రికేయులకు కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక తరపున గోగర్ల రాజేశం జిల్లా అధ్యక్షులు మంచిర్యాల తెలంగాణ ఉద్యమకారుల వేదిక తరపున డిమాండ్ చేస్తున్నాను నిన్నటి రోజున కొంతమంది భూకబ్జాదారులు వారికి కేటాయించినటువంటి భూమిని దున్నడం చాలా బాధాకరం కావున ఈ విషయంపై స్థానిక రెవెన్యూ డిపార్ట్మెంట్ మరియు.మంచిర్యాల జిల్లా కలెక్టర్ గారు వెంటనే పాతికేయులకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని అంతేకాకుండా ఈ విషయంపై మా యొక్క తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ గారి దృష్టికి మా వంతుగా తీసుకెళ్లడం జరుగుతుంది నరాల సత్యనారాయణ ద్వారా సంబంధిత పై అధికారులకు చెప్పించడం కూడా జరుగుతుంది అంతేకాకుండా మా బెల్లంపల్లి ప్రాంతంలో ఉన్నటువంటి పాత్రికేయులు ఎండనకా వాననకా తెలంగాణ ఉద్యమ సమయంలో కీలకపాత్ర పోషించినారు కావున వాళ్లకు వెంటనే ప్రభుత్వం చర్య తీసుకుని వాళ్ళకు ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని మా యొక్క ప్రార్థన ఇట్లు గోగర్ల రాజేశం జిల్లా అధ్యక్షులు తెలంగాణ ఉద్యమకారుల వేదిక మంచిర్యాల జిల్లా.

# వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా పీహెచ్సీలో పాలు పండ్లు బ్రెడ్ పంపిణీ

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) జులై 08**



టేకులపల్లి :బుధవారం దివంగత మహానేత డాక్టర్ వై.యస్. రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైయస్సార్ అభిమానులు రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేసి గొప్ప సేవా కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో భూక్య బాలాజీ, నర్సింగ్ లక్ష్మయ్య, అంతోటి రాకేష్, అజయ్,డాక్టర్ కంచర్ల వెంకటేష్ పాల్గొన్నారు.వీరితో పాటు పబ్లిక్ హెల్త్ నర్సాఫీసర్ చంద్రకళ, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, సూపర్వైజర్లు విజయ కౌసల్య, నర్సింగ్ ఆఫీసర్ సుస్మిత అనసూర్య విజయ, బోడ రమేష్ తదితరులు కలిసి ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.వైయస్సార్ ఆశయాలకు అనుగుణంగా, పేద రోగులకు సహాయం చేయడం నిజమైన నివాళి. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకం అని వైఎస్ అభిమానులు అన్నారు..

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 8**




ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండల కేంద్రం, మందమర్రి పట్టణంలోని జోన్ 1, 2 లను ఆయా మండలాల తహసిల్దార్లతో కలిసి సందర్శించి బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయడం జరిగిందని, పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాల వివరాలు నమోదు చేసిన తర్వాత తిరిగి తీసుకుని డిజిటలైజ్ చేయాలని తెలిపారు. వాలంటీర్లు, బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్ల సహాయంతో ఎన్యూమరేషన్ ఫారాలలో వివరాల నమోదు ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. అనంతరం మందమర్రి, నెన్నెల, బెల్లంపల్లి మండలాల తహసిల్దార్ కార్యాలయాలను బి సెక్షన్ సూపరింటెండెంట్ తో కలిసి సందర్శించి సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ వేగవంతం, భూ సేకరణ సంబంధిత అంశాలపై కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాలు నమోదు చేసిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 మంది ఓటర్లకు మించకుండా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రణాళిక ప్రకారం చేపట్టాలని తెలిపారు. సాదాబైనమా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి భూభారతి పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, విరాసత్ ఇతర సేవలను, భూ సంబంధిత సేవలను నిబంధనల ప్రకారం వేగవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కరణ వేగవంతం చేయాలని, సర్టిఫికెట్లను నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని తెలిపారు. కార్యాలయ సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, కార్యాలయానికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసిల్దారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 106 కేసుల్లో నిందితుడిగా పేరుగాంచిన అలవాటు దొంగ అరెస్ట్

- 22.5 తులాల బంగారు ఆభరణాలు, 60 తులాల వెండి ఆభరణాలు, రూ. 25,000 నగదు స్వాధీనం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు
- కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్



**పటాన్ చేరు, .జూలై 08 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లా సీసీఎస్ పోలీసులు, గుమ్మడిదల పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో 80 పాత కేసులు, 26 కొత్త కేసుల్లో నిందితుడైన అలవాటు హౌస్ బ్రేకింగ్ నిందితుడు కోటపల్లి చంద్రి అలియాస్ శేఖర్ను అరెస్ట్ చేసి, నిందితుడి వద్ద నుంచి 22.5 తులాల బంగారు ఆభరణాలు, 60 తులాల వెండి ఆభరణాలు, రూ. 25,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో వరుసగా చోటుచేసుకుంటున్న ఇంటి దొంగతనాల నేపథ్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టగా. సీసీఎస్ సంగారెడ్డి, గుమ్మడిదల పోలీసులు సంయుక్త ఆపరేషన్ లో నిందితుడిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. నిందితుడు 2007 సంవత్సరం నుంచి రాత్రివేళల్లో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతూ ఇళ్లలో చొరబడి బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు దొంగిలించి, తెలిసిన వ్యక్తులకు విక్రయించడం లేదా తాకట్టు పెట్టడం ద్వారా అక్రమంగా డబ్బు సంపాదిస్తూ, విలాసవంతమైన జీవితం గడపడం కోసం ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడిపై హైదరాబాద్, సంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో 80 పాత కేసులు (ఒక పోక్సో కేసు మేడ్చల్ పోలీసు స్టేషన్ పరిదిలో), 26 కొత్త కేసులు నమోదై ఉన్నాయని, ఇప్పటివరకు అతడు 19 సార్లు జ్యుడీషియల్ రిమాండ్‌కు వెళ్లి, పలుమార్లు బెయిల్‌పై విడుదలయ్యాడని, 25 పైగా కేసుల్లో శిక్షలు కూడా అనుభవించినప్పటికీ, తన నేర ప్రవర్తనలో మార్పు లేకుండా ఇదే తరహా దొంగతనాలకు పాల్పడుతూ వచ్చాడని పేర్కొన్నారు. 2024 లో మేడిపల్లి పోలీసులు అతడిని అరెస్ట్ చేసి చర్లపల్లి సెంట్రల్ జైలుకు పంపగా, సుమారు 14 నెలలు జైలులో ఉన్నాడు. అనంతరం 17.10.2025న బెయిల్‌పై విడుదలైనా మూడు రోజులకే తిరిగి ఇంటి దొంగతనాలు ప్రారంభించాడు.

నిందితుడి నేర ప్రవృత్తి : నిందితుడు ముందుగా ఒంటరిగా ఉన్న ఇళ్లు, తాళం వేసి ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లను గమనించి ఎంపిక చేసుకుంటాడు. ఇంట్లో లైట్, ఫ్యాన్, ఏసీ ఆన్‌లో ఉన్నాయా లేదా అన్నది పరిశీలించి, ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత వెనుక వైపు నుంచి ప్రవేశిస్తాడు. ఇంటి వెనుక భాగంలో పొదలు లేదా ఖాళీ ప్రదేశం ఉన్న ఇళ్లను లక్ష్యంగా ఎంచుకుని, చోరీ అనంతరం తప్పించుకోవడానికి వెనుక తలుపు తెరిచి ఉంచేవాడు. దొంగతనం చేసిన తర్వాత తెల్లవారుజాము వరకు పొదల్లో దాక్కొని, ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయేవాడు. గత ఎనిమిది నెలల కాలంలో నిందితుడు మొత్తం 26 ఇంటి దొంగతనాలు చేసినట్లు విచారణలో తేలింది. వాటిలో మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 7 కేసులు, దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులు , గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు, హత్నూరా పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు, పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులు, మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు, పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులు, అలాగే అబ్దుల్లాపూర్‌మెట్, ఐడీఏ బొల్లారం, వనస్థలిపురం, జీనోమ్ వ్యాలీ, శామీర్‌పేట్, కీసర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కో కేసు చొప్పున నమోదయ్యాయి. నిందితుడు దొంగిలించిన బంగారు ఆభరణాల్లో కొంత భాగాన్ని తెలిసిన వ్యక్తులకు అమ్మివేయగా, మరికొంత భాగాన్ని రుణాల కోసం తాకట్టు పెట్టాడు. ఇంకొంత భాగాన్ని తన వద్ద ఉంచుకుని, విక్రయించిన సొమ్మును వ్యక్తిగత అవసరాలు, విలాసవంతమైన జీవనశైలికి ఖర్చు చేసినట్లు విచారణలో తేలింది. అతని వద్ద నుంచి 22.5 తులాల బంగారు ఆభరణాలు, 60 తులాల వెండి ఆభరణాలు, రూ. 25,000 నగదు స్వాధీనం చేసుకున్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు రోజున తేది: 07.07.2026న సీసీఎస్ సంగారెడ్డి పోలీసులు, గుమ్మడిదల పోలీసులతో సమన్వయంతో, బొంతపల్లి కమాన్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకొని, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది.

అరెస్ట్ చేసిన నిందితుని వివరాలు: కోటపల్లి చంద్రి అలియాస్ శేఖర్, తండ్రి వెంకటయ్య, వయస్సు 31 సంవత్సరాలు, కులం ముదిరాజ్, వృత్తి కారు డ్రైవర్, స్వస్థలం బోయపల్లి గేట్, రైల్వే స్టేషన్ సమీపం, మహబూబ్‌నగర్ జిల్లా, ప్రస్తుతం గాగిల్లాపూర్ గ్రామం, దుండిగల్ మండలం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నివాసి. ఈ కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వి. శివకుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చి. ప్రసాద్ రావు, జిన్నారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. రమణ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ కె. శ్రీకాంత్, అలాగే గుమ్మడిదల ఎస్ఐ కె. అరుణ్ కుమార్ మరియు సంబంధిత సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ అభినందించారు. పటాన్‌చెరు ఎస్‌డీపీఓ ప్రభాకర్ పర్యవేక్షణలో సీసీఎస్ సంగారెడ్డి బృందం, గుమ్మడిదల పోలీసులు సమన్వయంతో పనిచేసి ప్రశంసనీయ ఫలితాలు సాధించారని ఎస్పీ పేర్కొన్నారు.



## మైత్రి ల్యాబ్లో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి 80 లక్షల చెక్కును కంపెనీ యజమాన్యం చేతుల మీదుగా అందజేశారు

**పటాన్ చేరు, .జూలై 08 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

గుమ్మడిదల మైత్రి ల్యాబ్స్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు ల్యాబ్ ఫ్యూమ్స్ పీల్చుకోవడంతోలి పడిపోయిన ఘటన గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని మైత్రి ల్యాబ్ పరిశ్రమలో చోటుచేసుకుంది వెంటనే పరిశ్రమ యాజమాన్యం మల్లారెడ్డి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో గాంధీ ఆసుపత్రికి పంపించారు తరలించగా పరిస్థితి విషమి చికిత్స పొందుతూ మృతి చెందారు ఇట్టి విషయమై సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య ప్రత్యేక చొరవ తీసుకొని పరిశ్రమ యాజమాన్యంతో కుటుంబానికి పరిహారం విషయంలో సంప్రదింపులు జరిపి చిట్టచివరకు 80 లక్షలు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం తల్లికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేయగా పరిశ్రమ యాజమాన్యం ఒప్పుకొని సిఐటియు కే రాజయ్య, నాగభూషణం, కమ్మరి రవీందర్ చారి, శ్రీధర్ రావు,ల సమక్షంలో పరిశ్రమ యాజమాన్యం సిహెచ్ నాగ రాకేష్, ఏకే రాంప్రసాద్, ఎన్ శ్రీనివాసరావు, పి కుమార్, ఇ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ బాలకృష్ణ,లు కలిసి కుటుంబ సభ్యులకు 80 లక్షల చెక్కును అందజేశారు. మృతుని తల్లి తన కొడుకు తనకు పుత్రశోకం మిగిల్చిపోయాడని శోకసముద్రంలో మునిగిపోయారు కార్యక్రమంలో మృతుని తల్లి గడ్డమీది నిర్మల చెల్లెలు గడ్డమీది మౌనిక కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



## మిషన్ భగీరథ లైన్‌మెన్‌ల సమస్యల పరిష్కారానికి మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ కు వినతిపత్రాల అందజేత

**కురవి జులై 08(ప్రజా తీర్పు విలేఖరి)**

మిషన్ భగీరథ ఓఅ ఎం పాలేరు--వరంగల్ గ్రిడ్ సెగ్మెంట్‌లో 2018 నుంచి గత 9 సంవత్సరాలుగా లైన్‌మెన్‌లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులు తమ ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు మిషన్ భగీరథ లైన్మెన్ లు వినతి పత్రం సమర్పించారు.ప్రభుత్వ అధికారిక లాగ్ షీట్లు,రికార్డుల్లో "లైన్‌మెన్"గా నమోదు చేసినప్పటికీ,వేతనాల విషయంలో మాత్రం ఆ హోదాకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి లైన్‌మెన్ 40--50 కిలోమీటర్ల పరిధిలో తాగునీటి పైప్‌లైన్ల నిర్వహణ,లీకేజీల మరమ్మతులు,వాల్వుల ఆపరేషన్,అత్యవసర సేవలు అందిస్తూ ప్రజలకు నిరంతర నీటి సరఫరా కోసం సేవలందిస్తున్నామని తెలిపారు.గత తొమ్మిది సంవత్సరాలుగా ఇదే విధులు నిర్వహిస్తున్నప్పటికీ, హై స్కిల్డ్ ఉద్యోగులుగా గుర్తింపు, చట్టబద్ధమైన కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇయస్ఐ,భీమా,పదోన్నతి వంటి హక్కులు అమలు కావడం లేదని పేర్కొన్నారు.ఈ మధ్య కాలంలో ప్రభుత్వం నిర్వహించిన డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు వేస్తున్న సమయంలో (ఓఎం) గైడ్ లైన్స్ లోని ఒప్పంద మార్గదర్శకాలను మార్పులు చేసి స్కిల్ విభాగంలో ఉన్న లైన్ మెన్ లను అన్ స్కిల్ విభాగంలోకి లైన్ మెన్ అనే పదాన్ని తొలగించి హెల్పర్ అనే పదాన్ని జోడించి,హోదా ను తగ్గిస్తూ, ఆర్థికంగా అన్యాయం జరిగుతుంది.ప్రభుత్వం కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు ఏజెన్సీలు కంపెనీలు నుండి సేకరిస్తున్నారు.వారి ప్రస్తుత హోదాను తగ్గించి కింది స్థాయిలో హెల్పర్లుగా రిపోర్టు అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అందువల్ల ప్రభుత్వ రికార్డుల్లో తమను అధికారికంగా లైన్ మెన్ లను గుర్తించి, హై స్కిల్ ఉద్యోగులు గా వర్గికరించి చట్టబద్ధమైన వేతనాలు, ఉద్యోగ భద్రత,ఇతర కార్మికుల హక్కులను తక్షణమే అమలు చేయాలని మంత్రి సీతక్క ను కోరారు.తమ న్యాయమైన డిమాండ్ల పై సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అలువాల కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శానం ఉపేందర్, ఉపాధ్యక్షులు కోట శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ సైదులు, మరియు జిల్లా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## బోడుప్పల్‌లో ఓపెన్ జిమ్ మంజూరు - ఎంపీ ఈటల రాజేందర్‌కు కాలనీ వాసుల కృతజ్ఞతలు

**బోడుప్పల్ సర్కిల్, జూలై 8. ( ప్రజాతీర్పు )**

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అమ్మసాని వెంకటరెడ్డి కాలనీ అభివృద్ధికి మరో అడుగు పడింది. కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు మంజూరు కల్పించడంలో సహకరించిన మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్‌ను కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎంపీని మర్యాదపూర్వకంగా కలుసుకుని కాలనీ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ అంజయ్య మాట్లాడుతూ, కాలనీ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ జిమ్ ఏర్పాటు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ముఖ్యంగా యువత, మహిళలు, వృద్ధులకు వ్యాయామం చేసే సదుపాయం కలగడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. కాలనీలో ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలకు ముందుండి సహకరిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సమన్వయం చేసి సహకరించిన బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా సెక్రటరీ పద్మ మహేశ్వర్ రెడ్డి కి కూడా కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన చేసిన కృషి వల్లే ఈ పని త్వరగా సాధ్యమైందని వారు పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధి కోసం భవిష్యత్తులో మరిన్ని సదుపాయాలు కల్పించాలని ఎంపీని కోరినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కాలనీలో పార్కులు, రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కూడా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, ఓపెన్ జిమ్ ఏర్పాటు వల్ల కాలనీకి కొత్త ఊపు వస్తుందని, ప్రజలు ఆరోగ్యంపై మరింత దృష్టి పెట్టే అవకాశముందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తే ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## స్పష్టత, ఆత్మవిశ్వాసాలతో విజయం తథ్యం

- ప్రాంగణ నియామకాల కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థులకు టీఎంసీజీ డైరెక్టర్ మార్గదర్శనం

**పటాన్ చేరు, జైలై 08 (ప్రజాతీర్పు ప్రతినిధి)**




హెచ్ఆర్ ఇంటర్వ్యూలో విజయం సాధించడం అంటే పరిపూర్ణమైన సమాధానాలు ఇవ్వడం కాదని, స్పష్టత, ఆత్మవిశ్వాసం, లక్ష్యంతో స్పందించడమేనని శిక్షణ, మార్గదర్శకత్వం, కెరీర్ గైడెన్స్ (టీఎంసీజీ) సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ స్పష్టీకరించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని 2027 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ విద్యార్థుల కోసం 'హెచ్ఆర్ ఇంటర్వ్యూ ప్రశ్నలపై పట్టు సాధించడం' అనే అంశంపై బుధవారం ఆమె కెరీర్ కు సిద్ధం చేసే కార్యక్రమాన్ని ఆన్ లైన్లో నిర్వహించారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలోని టీఎంజీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని ఉద్దేశించి డాక్టర్ మాథ్యూ మాట్లాడుతూ, ఒక బలమైన రెస్యూమే ఇంటర్వ్యూ అవకాశాన్ని కల్పించగలిగినప్పటికీ, ఒక అభ్యర్థికి తుది ఉద్యోగ ఆఫర్ లభిస్తుందా, లేదా అనేది తరచుగా హెచ్ఆర్ రౌండే నిర్ణయిస్తుందని ఆమె పేర్కొన్నారు. హెచ్ఆర్ ఇంటర్వ్యూల సమయంలో రిక్రూటర్లు నిజంగా ఏమి చూస్తారో అర్థం చేసుకోవడంలో విద్యార్థులకు సహాయపడటంపై ఈ ముఖాముఖి కార్యక్రమం దృష్టి సారించింది. ఇందులో సమర్థవంతమైన స్వీయ పరిచయాలు, బలాలు, బలహీనతలు, విజయాలు, కెరీర్ లక్ష్యాలపై సాధారణంగా అడిగే ప్రశ్నలకు సమాధానమిచ్చే వ్యూహాలు, ఆత్మవిశ్వాసంతో మాట్లాడే పద్ధతులు, ఇంటర్వ్యూ పనితీరును ప్రతికూలంగా ప్రభావితం చేసే సాధారణ తప్పుల వంటి అంశాలను చర్చించారు. విద్యార్థులు తమ స్వభావానికి అనుగుణంగా సహజ సిద్ధంగా వ్యవహరించాలని, తమ ఆకాంక్షలను సమర్థవంతంగా వ్యక్తీకరించాలని, ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలను ఎదుర్కోవాలని డాక్టర్ మాథ్యూ ప్రోత్సహించారు. సాంకేతిక నైపుణ్యం అవకాశాలకు ద్వారాలు తెరుస్తుందని, అయితే సంభాషణా నైపుణ్యాలు, సరైన వైఖరి అభ్యర్థులకు వాటిని దక్కించుకోవడంలో సహాయపడతాయని ఆమె పునరుద్ఘాటించారు ఈ సెషన్ ఆసక్తికరమైన ప్రశ్నోత్తరాల కార్యక్రమంతో ముగిసింది. దీనిలో విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకుని, నియామక ప్రక్రియపై ఆచరణాత్మక అవగాహన పొందారు. ఈ కార్యక్రమం తమ ఇంటర్వ్యూ సన్నద్ధతను మెరుగుపరిచినందుకు, రాబోయే ప్రాంగణ నియామకాల కోసం ఆత్మవిశ్వాసాన్ని బలోపేతం చేసినందుకు, ఇందులో పాల్గొన్న విద్యార్థులు కృతజ్జతలను తెలియజేశారు.

## నర్సంపేట వైయస్సార్ స్మారక గార్డెన్‌లో ఘనంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ లివైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు

**నర్సంపేట జూలై 8 ప్రజా తీర్పు**



నర్సంపేటలోని వైయస్సార్ స్మారక గార్డెన్‌లో దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ నాడెం శాంతి కుమార్‌లి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైయస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి నివాళులు అర్పించి, అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాడెం శాంతి కుమార్ మాట్లాడుతూ... వైయస్సార్ ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో రైతులకు ఉచిత విద్యుత్, పేదలకు ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి చారిత్రాత్మక పథ ాకాలను అందించి లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచారని అన్నారు. రైతులు, పేదలు, విద్యార్థుల అభివృద్ధి కోసం వైయస్సార్ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని తెలిపారు. వైయస్సార్ మీద తనకు ఉన్న అపారమైన అభిమానం, ఆయన ప్రజాసేవ స్ఫూర్తి ఎప్పటికీ తనకు ఆదర్శమని నాడెం శాంతికుమార్ పేర్కొన్నారు. మహానేత వైయస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన చేసిన సంక్షేమ కార్యక్రమాలు, జ్ఞాపకాలు అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని తెలిపారు కార్యక్రమంలో పాల్గొన్నవారు నాడెం నాగేశ్వర్,జిల్లా పెల్లి దినేష్, కోక్కర్ కొండ కట్టయ్య, ఎస్.కె కాజా బి, సల్ల కర్ణాకర్, గాండ్ల రాజు, ఎస్కే జాఫర్, రాజు, హమాలి కార్మికులు, నాడెం బ్రదర్స్ పాల్గొన్నారు . కృతజ్ఞతలతో.... నాడెం శాంతి కుమార్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్, నర్సంపేట నియోజకవర్గం,జిల్లా వరంగల్.

# కోహెడలో స్వర్గీయ వైఎస్సార్‌కు ఘన నివాళులు

**కోహెడ జూలై 8 (ప్రజాతీర్పు ప్రతినిధి)**




దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సిద్దిపేట జిల్లా కోయిల మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శెట్టి సుధాకర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి స్వర్గ రాజశేఖర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు శెట్టి సుధాకర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపాడని కొనియాడారు. రైతులకు ఉచిత విద్యుత్తు రెండు రూపాయల కిలో బియ్యము ఫీజు రియంబర్స్మెంట్ తదితర అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నాడని ఈ సందర్భంగా పేర్కొన్నాడు. డాక్టర్ వైఎస్సార్ ప్రజల సంక్షేమాన్ని జీవిత లక్ష్యంగా తీసుకుని రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ప్రజాసేవకు ఆయన చూపిన అంకితభావం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బందుల సుజాత బాలకృష్ణన్, చంద్రారెడ్డి, బాలరాజ్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బోయిని నిర్మల జయరాజ్, వైస్ చైర్మన్ భీంరెడ్డి తిరుపతిరెడ్డి, దొమ్మట జగన్ రెడ్డి, రామచంద్రాపూర్ ఉపసర్పంచ్ మహేందర్, ప్రభాకర్ రెడ్డి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# మంథనిలో మద్యం వైన్స్‌ల రాజ్యం

## ఎక్సైజ్.. ఫుడ్ సేఫ్టీ అధికారుల నిర్లక్ష్యంపై డివైఎఫ్ఐ ఆగ్రహం

**మంథని, జూలై-08 (ప్రజాతీర్పు)**

మంథని పట్టణంలో మద్యం దుకాణాలు నిబంధనలను బేఖాతరు చేస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత ఎక్సైజ్, ఫుడ్ సేఫ్టీ శాఖల అధికారులు కునుకుపాటు నిద్రపోతున్నారని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాన రోడ్డుపై ఉన్న మహాలక్ష్మి వైన్స్‌తో పాటు ఇతర మద్యం దుకాణాల్లో పర్మిట్ రూమ్ పేరుతో అక్రమంగా స్నాక్స్ విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఎక్సైజ్ చట్టం--1968 ప్రకారం మద్యం దుకాణాల లోపల మద్యం సేవించడం, ఆహార పదార్థాలు విక్రయించడం నిషేధమైనప్పటికీ మంథనిలోని మహాలక్ష్మి వైన్స్‌లో మాత్రం పక్కనే టేబుళ్లు ఏర్పాటు చేసి పకోడీలు, వేరుశనగలు తదితర స్నాక్స్‌ను విక్రయిస్తున్నారని ఆరోపించారు. వంట చేసే ప్రదేశం పూర్తిగా అపరిశుభ్రంగా ఉండటంతో పాటు నాణ్యతలేని నూనెను ఉపయోగిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా షాపు వెనుక భాగంలో మరుగుదొడ్లు లేకపోవడంతో ఖాళీ స్థలంలోనే మూత్ర విసర్జన జరుగుతోందని, వైన్స్ పరిసరాల్లో సరైన శుభ్రత లేక ప్లాస్టిక్ సీసాలు, పగిలిన బీర్ బాటిళ్లు, కాగితాలు పేరుకుపోయి చెత్తకుప్పలను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు, ఈగలు అధికంగా పెరిగి మద్యం సేవించే సమయంలో గ్లాసుల్లో పడే పరిస్థితి ఏర్పడుతోందని, దీనివల్ల అంటువ్యాధులు ప్రబలే



ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం పర్మిట్ రూమ్ లేదా బార్ నిర్వహించాలంటే ఎక్సైజ్ శాఖ నుంచి ఎఫ్ఎల్--2 లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, అయితే మంథనిలోని పలు వైన్స్ షాపులు నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూమ్‌లు నిర్వహిస్తూ కనీస ప్రమాణాలు పాటించకుండా అపరిశుభ్ర వాతావరణంలో మద్యం ప్రియులకు ఆహార పదార్థాలు విక్రయిస్తున్నాయని ఆరోపించారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఏ ఒక్క వైన్స్ షాపును గానీ, అందులో నిర్వహిస్తున్న పర్మిట్ రూమ్‌లను గానీ ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేయకపోవడం ఆశ్చర్యకరమని విమర్శించారు. ప్రతిరోజూ వందలాది మంది మద్యం ప్రియులు ఈ అపరిశుభ్ర పరిస్థితుల్లో మద్యం సేవిస్తూ అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉన్నందున సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని, అనుమతి లేకుండా కొనసాగుతున్న పర్మిట్ రూమ్‌లను సీజ్ చేయాలని, పర్మిట్ రూమ్ పేరుతో అక్రమంగా స్నాక్స్ విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు కోరుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా మంథనిలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న పర్మిట్ రూమ్‌లపై ఫుడ్ సేఫ్టీ, ఎక్సైజ్ శాఖ అధికారులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వైన్స్ షాపుల లైసెన్సులను రద్దు చేయాలని, పరిసరాలను పూర్తిగా శుభ్రం చేయించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించే చర్యలు చేపట్టాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేశారు. అలాగే టేక్ అవే విధానాన్ని అడ్డుపెట్టుకొని జరుగుతున్న అక్రమాలపై కూడా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



## నాణ్యమైన విద్యతో ఆకట్టుకుంటున్న నిజాంసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

**నిజాంసాగర్ జులై 8 ( ప్రజా తీర్పు)**

నిజాంసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇప్పటివరకు 74 మంది కొత్త విద్యార్థులు చేరగా, వారిలో 16 మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలకు మారడం విశేషంగా నిలిచింది. ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల విశ్వాసం పెరుగుతున్నందుకు ఇది నిదర్శనమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని నిలబెట్టేలా నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇస్తూ బోధన కొనసాగిస్తామని చెప్పారు. పాఠశాలలో విశాలమైన తరగతి గదులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, క్రీడా మైదానం, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్య వసతులు వంటి అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కొత్తగా చేరిన విద్యార్థులకు ఉపాధ్యాయులు చాక్లెట్లు, పెన్సిళ్లు అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. విద్యార్థులు చదమొత్తం విద్యార్థుల సంఖ్య 219 కాగా, వీరిలో 150 మంది తెలుగు మాధ్యమం, 70 మంది ఆంగ్ల మాధ్యమంలో విద్యనభ్యసిస్తున్నారు. అయితే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టు, బయోలజికల్ సైన్స్ ఉపాధ్యాయుల పోస్టు ఖాళీగా ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వర్క్ అడ్జస్ట్మెంట్ ద్వారా బయో సైన్స్ ఉపాధ్యాయుడిని తక్షణమే నియమించాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ), మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ)లకు వినతిపత్రం అందజేయనున్నట్లు వెల్లడించారు.



## సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జవీూఖీ అసిస్టెంట్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన సింగరేణి రిటైర్మెంట్ కార్మిక సంఘం

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) జూలై 08**

గోదావరిఖని లోని రీజినల్ కమీషనర్ జవీూఖీ కార్యాలయం లో బెల్లంపల్లి , మందమర్రి , శ్రీరాంపూర్ మరియు సింగరేణి ఇతర ఏరియా లలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ఎదురుకునే సమస్యలను పరిష్కరించాలని అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్ వారికి మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ప్రతి నెల 1 వ తారీఖు ననే వివిధ బ్యాంకు లలో ఖాతాదారులైన బొగ్గు పెన్షన్ దారులకు వారి వారి ఖాతాలలో పెన్షన్ జమ అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని , ఈ నెల ూదీ× ఖాతాదారులకు 1 వ తేదీ న కాకుండా 3 తారీఖు న పెన్షన్ వారి ఖాతాలో జమ కావడం మూలాన అతి తక్కువ పెన్షన్ పొందుతున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులు నానా రకాలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదురుకున్నారని , అదే విధంగా వేలాది మంది విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (ూూా) కాపీ లు అందలేదని కావున ూూా ఆర్డర్ లు రాని వారికి వెంటనే ఇప్పించే ఏర్పాటు చేయగలరని , పదవీ విరమణ చేస్తున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగుల క్లెయిమ్స్ ను జాప్యం కాకుండా త్వరగా పరిష్కరించాలని గోదావరిఖని లోని జవీూఖీ అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్ వారికి సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఇచ్చిన వినతి పత్రం పై సానుకూలంగా స్పందించిన అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్ విశ్రాంత ఉద్యోగుల ఎదురుకునే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న , అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, ఉపాధ్యక్షులు ఏ గంగయ్య తదితరులు పాల్గొన్నారు..



## ఇల్లందు 16వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో SIR ప్రక్రియలో ఫారమ్‌లను ఫిల్ చేసిన నాయకులు

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు ఇల్లందు) జులై 08**

ఇల్లందు :శాసనసభ్యులు కోరం కనకయ్య ఆదేశాల మేరకు, ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ సూచనలతో, మున్సిపల్ కౌన్సిలర్ శ్రీమతి ఉల్లింగ విజయలక్ష్మిసతీష్ ఆధ్వర్యంలో ఈరోజు 16వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు సంబంధించిన దరఖాస్తు (ఎన్యూమరేషన్) ఫారమ్‌లను పరిశీలించి, అర్హులైన వారి ఫారమ్‌లను ఫిల్ చేసి సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మిసతీష్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఫారమ్‌లు ఫిల్ చేస్తున్నారని, ప్రజలు ఈ ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి సతీష్, బీఎల్ఓ ధనలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి. భద్రం, బీఎల్ఏ వీరేందర్, సంతోష్, అప్పలరాజు, 16వ వార్డు యూత్ విభాగం నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని ూ×= ఫారమ్‌లను ఫిల్ చేశారు.



## ఎలినినో ఎఫెక్ట్ దృష్ట్యా పంటల మార్పిడి తప్పనిసరి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 8**

జిల్లాలో రైతులు సంప్రదాయ వరి సాగుకే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా పంటల వైవిధ్యం వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన, నాబార్డ్, బ్యాంకింగ్, పరిశ్రమలు, డీఆర్డీఓ మరియు సహకార శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో అమలవుతున్న పథకాలు, రైతులకు అందుతున్న సేవలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది ఎలినినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం మండలాల వారీగా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. విత్తనాలు, ఎరువులను ముందస్తుగానే అందుబాటులో ఉంచాలని, ముఖ్యంగా యూరియా వాడకాన్ని తగ్గించి, 'నానో యూరియా' వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని ఎరువుల కంపెనీలకు సూచించారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను జోడించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వాతావరణ సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు చేరవేసేలా ప్లానింగ్ చేయాలన్నారు. అలాగే, పొలాల్లో మిగిలిపోయే వ్యవసాయ వ్యర్థాల ద్వారా బై-ప్రొడక్ట్స్ తయారు చేసి అదనపు ఆదాయం పొందే మార్గాలను రైతులకు వివరించాలన్నారు.

### సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు డీఆర్డీఓ ఆధ్వర్యంలో ఫామ్ పాండ్స్, పర్కోలేషన్ ట్యాంక్స్, మినీ ట్యాంక్స్, ఓపెన్ వెల్స్ నిర్మాణానికి రైతులను ప్రోత్సహించాలన్నారు. కూరగాయల సాగు చేసే వారికి పందిళ్ల ఏర్పాటుకు సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్, ఫార్మర్ రిజిస్ట్రీ, రైతు బీమా వంటి పథకాల్లో ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో మట్టి నమూనాల సేకరణ వేగవంతం చేసి, భూసార కార్డుల ప్రాముఖ్యతను రైతులకు వివరించాలన్నారు. రైతులు అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేసి, సూర్యాపేట జిల్లాను ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, డిఆర్డిఓ సన్యాసయ్య, జిల్లా ఆర్టికల్చర్ అధికారి నాగయ్య, పెర్టిలైజర్స్ వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## భూభారతి చట్టం-2025 ద్వారా భూహక్కులు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

- 2,960 ఎకరాలకు సంబంధించి ఫైల్స్ సిద్ధం చేయండి
- నూతనకల్, మద్దిరాల మండలాల సిబ్బందికి కలెక్టర్ ఆదేశం

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 8**

ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న రైతులకు భూహక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నూతనకల్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, సర్వే సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. భూభారతి చట్టం-2025 ద్వారా అర్హులైన రైతులకు పట్టాలు మంజూరు చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు.

నూతనకల్ మండలంలోని 9 గ్రామాలు, మద్దిరాల మండలంలోని 5 గ్రామాలు కలిపి మొత్తం 15 గ్రామాల్లో మొత్తం 2,960 ఎకరాలకు సంబంధించి సుమారు 1,780 మంది రైతులు లబ్ధి పొందాల్సి ఉందని తెలిపారు. రీ-సర్వే ప్రక్రియ కొనసాగుతున్నందున.. గ్రామాల్లో బౌండరీ సర్వే, ప్రభుత్వ భూముల సర్వే, పట్టా భూముల విస్తీర్ణం వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. వీటికి సంబంధించిన డాక్యుమెంట్లను సిద్ధం చేసి, తదుపరి చర్యల కోసం నివేదికలు పంపాలని ఆదేశించారు. సర్వేపై రోజువారీ రిపోర్టులు అందించాలని స్పష్టం చేశారు.

### బయో బ్యాగుల యూనిట్ పరిశీలన

అంతకుముందు కలెక్టర్ సూర్యాపేటలోని 'శ్రీ వెంకటేశ్వర బయో బ్యాగుల తయారీ కేంద్రాన్ని' సందర్శించారు. బయో ప్రొడక్టుల తయారీ విధానం, అందుకు అయ్యే ఖర్చు, మార్కెటింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ హితమైన ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ-2026లో భాగంగా ఓటర్ల జాబితా రూపకల్పనపై కలెక్టర్ ఆరా తీశారు. మొత్తం 29,261 మంది ఓటర్లకు గాను, ఇప్పటివరకు 8,116 మంది ఓటర్ల వివరాలను ఈసిఐ మొబైల్ అప్లికేషన్ ద్వారా డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన ఎన్యూమరేషన్ ఫారాలను కూడా త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమం లో ఆర్డిఓ వేణు మాధవరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా నిర్వహించాలి

- ఎంఆర్వోకు బీజేపీ యువమోర్చా వినతిపత్రం
- అక్రమ ఓట్ల నమోదును అరికట్టాలని ఎర్రోళ్ల శ్రీకాంత్ డిమాండ్

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 8 :**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన వారికే ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ యువమోర్చా నాయకులు బుధవారం పెద్దపల్లి మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్వో)కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ యువమోర్చా నాయకుడు ఎర్రోళ్ల శ్రీకాంత్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ఓటరు జాబితా సవరణలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. తప్పుడు ధృవపత్రాల ఆధారంగా అర్హత లేని వారికి ఓటు హక్కు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం తమ దృష్టికి వచ్చిందని, అలాంటి చర్యలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. బూత్ లెవల్ అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, ఒకే ఇంట్లో అధిక సంఖ్యలో నమోదైన ఓట్లు, వలస వచ్చిన వారి వివరాలను ప్రత్యేకంగా



పరిశీలించాలని సూచించారు. అలాగే మరణించిన వారి పేర్లు, ద్వంద్వ ఓట్లు (డబుల్ ఓట్స్) వెంటనే తొలగించి లోపాలు లేని ఓటరు జాబితాను రూపొందించాలని కోరారు. తప్పుడు సమాచారం ఇచ్చి ఓటు హక్కు పొందేందుకు ప్రయత్నించే వారిపై, వారికి సహకరించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి యువకుడికి, ప్రతి పౌరుడికి ఓటు హక్కు దక్కేలా చూడడంతో పాటు ఒక్క అక్రమ ఓటు కూడా జాబితాలో చేరకుండా బీజేపీ యువమోర్చా నిరంతరం నిఘా ఉంచుతుందని తెలిపారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పోల్సాని సంపత్‌రావు, ఉప్పు కిరణ్, గుడ్ల సతీష్, బొడ్డుపల్లి కుమార్, గాదాసి సతీష్, మధుకరణ్, పోగుల రాజు, కుక్క అంజి, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

